తిరుమలలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

» వైభవంగా పుష్కరిణిలో చక్రస్నానం



గరుడ పటాన్ని కిందకు దించి హారతి ఇస్తున్న అర్చకులు



చక్రస్నానం సందర్భంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో మునక వేయిస్తున్న అర్చకులు

తిరుమల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ధ్వజావరోహణంతో గురువారం ముగిసాయి. సెప్టెంబరు 24న బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. గురువారం తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు స్వామికి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. 6 నుంచి వరాహ స్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామికి, శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానం చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కూడా ఇదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించారు.

బ్రహ్మోత్సవాల్లో 5.8 లక్షల మందికి దర్శనం: టీటీడీ చైర్మన్

తిరుమల బ్రహ్మోత్సవాల్లో 5.80 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. చక్రస్నానం అనంతరం ఆయన టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవనంలో మీడియాతో మాట్లాడారు. 26 లక్షల మందికిపైగా అన్నప్రసాదాలు అందించామని, 28 లక్షలకుపైగా లడ్డూలు విక్రయించామని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో రూ.25.12 కోట్ల హుండీ ఆదాయం లభించిందన్నారు. గరుడ వాహన సేవ రోజున హోల్డింగ్ పాయింట్ల ద్వారా 30 వేలు, రీఫిల్లింగ్ ద్వారా మరో 15 వేల మందికి అదనంగా దర్శనం చేయించామని తెలిపారు. బ్రహ్మోత్సవాలను దిగ్విజయం చేసిన టీటీడీ అర్చక స్వాములు, అధికారులు, ఉద్యోగులు, జిల్లా, పోలీసు యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా, భక్తులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ట్వీట్ ద్వారా హర్షం వ్యక్తం చేసిన అంశాన్ని చైర్మన్ గుర్తు చేశారు.

మాడ వీధుల్లోని గ్యాలరీలపై షెల్టర్లు: ఈవో

శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలోనూ బ్రహ్మోత్సవాల ప్రస్తావన వచ్చింది. భక్తుల సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించామని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. గరుడ వాహన సేవ రోజున ఉదయం ఎండ తీవ్రత, మధ్యాహ్నం మూడు సార్లు వర్షం పడిందని, భక్తుల విజ్ఞప్తి మేరకు నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా షెల్టర్లు ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్టు ఈవో వెల్లడించారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



తిరుమల ఆలయం ముందు జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి

తిరుమల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకోగా, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.కార్తీక్, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్ శర్మ, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బుశ్వాన్ గోయల్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీబగళాముఖి సన్నిధిలో జస్టిస్ గుణరంజన్



జస్టిస్ గుణరంజన్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చందోలు గ్రామంలో కొలువైన శ్రీబగళాముఖి అమ్మవారికి శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవటం, పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. జస్టిస్ గుణరంజన్‌కు ఆలయ ఈవో జి.నరసింహమూర్తి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు.

నిజ రూపంలో భ్రమరాంబదేవి దర్శనం

» నంది వాహనంపై విహరించిన ఆది దంపతులు

» శ్రీశైలంలో ముగిసిన దసరా ఉత్సవాలు



నిజరూపంలో దర్శనమిస్తున్న భ్రమరాంబదేవి

శ్రీశైలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో చివరి రోజైన గురువారం శ్రీశైలంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు విశేష పూజలు జరిగాయి. విజయదశమి పర్వదినాన అమ్మవారు నిజ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవను అశేష భక్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ఆలయ పుష్కరిణి వద్ద తెప్పోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఉదయం అమ్మవారి యాగశాలలో చండీయాగ పూర్ణాహుతి, స్వామి వారి యాగశాలలో రుద్ర యాగ పూర్ణాహుతి కార్యక్రమాలు జరిపారు. అనంతరం చండీశ్వరస్వామికి మల్లికార్జున గుండం వద్ద అవబుధ స్నానం నిర్వహించారు.

11 మంది సభ్యులతో

వేదగిరి క్షేత్రం పాలకమండలి


● కమిటీ చైర్మన్‌గా అచ్యుత్‌రెడ్డి?

నెల్లూరురూరల్ అక్టోబరు 3,(ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డును 11 మందితో ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవో విడుదల చేసింది. ఇందుపూరు శంకర్ అచ్యుతరెడ్డిని వేదగిరి క్షేత్రం చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలు ఇప్పటికే ప్రకటించారు. ఆయనతోపాటు ముత్తంశెట్టి శీనయ్య, చెరుకూరు సింహాద్రి, పురిణి సరస్వతీ, బెల్లం శ్రీనివాసులురెడ్డి, తోడేటి కామాక్షమ్మ, మదపాకుల జయమ్మ, కే కవిత, డబ్బుగుంట క్రిష్ణయ్య, సండీ మురళీయాదవ్, కనుకూరు శ్రావణి కమిటీలో చేర్చుతూ ప్రభుత్వం జీవోలో పేర్కొంది. కాగ ఈ జీవో ఆధారంగా దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ తుది ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉన్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

ఆటోడ్రైవర్ సేవలో..

కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వాహన మిత్రకు సంబంధించి ఉదయగిరి పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం ప్రాగంణంలో శనివారం నిర్వహించే ఆటోడ్రైవర్ సేవలో కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ఆటో డ్రైవర్లందరూ కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయ పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు చర్యలు చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజాస్వామిక వెలుగుబాటలు

లార్డ్ రిప్పన్ (ఆధునిక భారతీయ స్థానిక ప్రభుత్వాల పితామహుడు) నుంచి భారత రాజ్యాంగ సభ (1946) వరకు, ప్రాచీన గ్రామీణ పంచాయతీ వ్యవస్థ పునరుద్ధరణకు ఉద్దేశించిన 40వ ఆదేశిక సూత్రం నుంచి 73, 74వ రాజ్యాంగ సవరణల దాకా స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ పరిణామ చరిత్ర స్ఫూర్తిదాయకమైనది. ప్రజాస్వామిక నాగరీకంలో ప్రజలను సుశిక్షితులను చేస్తున్న ప్రాథమిక పాఠశాల స్థానిక ఎన్నికల వ్యవస్థ. తెలంగాణ రాష్ట్రం మరోసారి ఈ ఎన్నికలకు సంసిద్ధమవుతోంది. ఎస్సీ ఎస్టీ, మహిళలతో పాటు జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకూ రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించడంతో ఈ స్థానిక ఎన్నికలు మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. తొలుత పాలనా వ్యవస్థలో, దరిమిలా రాజకీయ రంగంలో కొత్త యువ నాయకత్వం ప్రభవించేందుకు ఈ ప్రజాస్వామ్య పోరు దోహదం చేయనున్నది.

సుదూర గతంలో ప్రతి గ్రామమూ ఒక గణతంత్ర రాజ్యంగా విలసిల్లుతుండేది. గ్రామస్తులు సమష్టిగా నిర్ణయాలు తీసుకునేవారు. స్థానిక పాలనకు బాధ్యత వహించే గ్రామ పెద్దలను 'గ్రామిక'లుగా కౌటిల్యుని 'అర్థశాస్త్రం' పేర్కొంది. రాచరికాలు ప్రబలి, సామ్రాజ్యాలు విస్తరిల్లిన తరువాత, ముఖ్యంగా బ్రిటిష్ వలసపాలనలో ఆ గ్రామీణ అధికార వికేంద్రీకరణ వ్యవస్థ పూర్తిగా ఛిద్రమైపోయింది. 1992లో 73, 74 రాజ్యాంగ సవరణలతో స్థానిక ప్రభుత్వాలకు వినూత్న ప్రజాస్వామిక స్వరూప స్వభావాలు సమకూరాయి. అణగారిన సామాజిక వర్గాల వారు రాజకీయ అధికారంలో భాగస్వాములు అయ్యారు. మరీ ముఖ్యంగా మహిళా సాధికారితకు ఇతోధిక దోహదం చేకూరింది. పలువురు మహిళలు పంచాయత్ సభ్యులుగా ప్రారంభమై శాసనసభ, పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావించి తీరాలి. 1997లో ఒడిషాలో ఒక ఆదివాసీ గ్రామ పంచాయత్ వార్డు సభ్యురాలుగా ఎన్నికైన ముర్ము ఆ రాష్ట్ర శాసనసభకు రెండుసార్లు ఎన్నికై ఆ తరువాత జార్ఖండ్ గవర్నర్‌గా పనిచేసి ఇప్పుడు భారత గణతంత్ర రాజ్య సార్వభౌమాధినేతగా ఉన్నారు. ఈ స్ఫూర్తిదాయక ఆదివాసీ విజయగాథ 73వ రాజ్యాంగ సవరణతోనే సుసాధ్యమయింది.

ఇదలా ఉంచితే ప్రభుత్వాలు ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవడం ఎంత ముఖ్యమో వాటి అమలులో చిత్తశుద్ధి పాటించడం అంతకంటే ముఖ్యం. గత సార్వత్రిక, తదనంతర అసెంబ్లీ ఎన్నికలలో నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ప్రజాస్వామ్య నైతిక సూత్రమైన ఓటు హక్కు లక్షలాది ప్రజలకు లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ. ఆ విషయమై ఎన్నికల సంఘంకు వ్యతిరేకంగా పెద్ద పోరాటమే చేస్తున్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు ఎన్నికలలో పోటీ చేసేందుకు అనర్హులన్న నిబంధనను కొనసాగించడం ముదావహం. అయితే సర్పంచ్, ఇతర వార్డు సభ్యులను ఏకాభిప్రాయంతో ఎన్నుకోవడాన్ని నగదు బహుమానాలతో ప్రోత్సహించే పద్ధతికి స్వస్తి చెప్పితీరాలి. ఎందుకంటే అది ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలహీనపరుస్తుంది.

'ప్రతి గ్రామం స్వావలంబనతో తన వ్యవహారాలను తానే నడుపుకోగలగాలి. ప్రపంచం మొత్తం ప్రతి కూలమయినా తనను తాను సంరక్షించుకోగలగాలి' అని గాంధీజీ పంచాయత్ వ్యవస్థకు ఆశయ నిర్దేశం చేశారు. ఈ ఆశయ సాధనకు మన 11వ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం ఒక ఆచరణాత్మక మార్గాన్ని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామాలకు అభివృద్ధి సామర్థ్యం కలిగించడమే ఆ నిర్మాణాత్మక బాట. ఆధునికీకరణకు ప్రగతిశీల రాజకీయాలే ప్రాతిపదిక కావడమనేది స్వతంత్ర భారతదేశ చరిత్ర విశిష్టత. ఈ దృష్ట్యా దళితులు, గిరిజనులు, మహిళలు, వెనుకబడిన వర్గాల వారికి పాలనావ్యవస్థ ల్లోనూ రాజకీయ అధికారంలోనూ గణనీయమైన భాగస్వామ్యం కల్పించేందుకు దోహదం చేస్తూ ఈ స్థానిక ఎన్నికలు తెలంగాణ ఔన్నత్యానికి వెలుగు బాటలు వేయాలి.

యుద్ధాల చీకటిలో మానవత

'ఇక యుద్ధం వద్దు, ఇంకెప్పుడూ యుద్ధం వద్దు' అని 1965లోనే పోప్ ఆరవ పాల్ ఘోషించారు. శాంతిని కోరుకునేవారు ఆయనను అభిమానించకుండా ఎలా ఉంటారు? యుద్ధాలు ఏ సమస్యనూ పరిష్కరించవు. శత్రుత్వాన్ని, విద్వేషాన్ని మాత్రమే పెంపొందిస్తాయి. 1945లో 51 దేశాలు సమున్నత ఆశయాలతో ఐక్యరాజ్యసమితిని సృష్టించాయి. అన్ని దేశాలూ శాంతి సామరస్యాలతో శాంతియుత సహజీవనం చేస్తూ సంపద్వంతం చేస్తూ తమ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తాయని ఆశించాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

చరిత్ర చెప్పిందేమిటి? ఐక్యరాజ్యసమితి విఫలమయిందనే కాదూ? ఆ ప్రపంచ సంస్థ చూస్తుండగానే గత ఎనిమిది దశాబ్దాలలో అనేక యుద్ధాలు జరిగాయి. ప్రస్తుతం రెండు యుద్ధాలు ప్రపంచాన్ని కుదిపివేస్తున్నాయి.

ఉక్రెయిన్ యుద్ధం ఫిబ్రవరి 24, 2022న ఆరంభమయింది. ఉక్రెయిన్‌ను రష్యా దురాక్రమించడంతో ప్రజ్వరిల్లిన ఈ యుద్ధాగ్నులు ఇప్పటికీ ఆరలేదు. ఎప్పటికి ఆరిపోతాయో తెలియదు. సోవియట్ యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ రిపబ్లిక్స్ ఉనికిలో ఉన్నప్పుడు ఉక్రెయిన్ అందులో భాగంగా ఉండేది. చాలా మంది రష్యన్లు, రష్యన్ భాష మాట్లాడే వారు ఉక్రెయిన్‌గా పిలవబడే ప్రాంతంలో నివశిస్తుండే వారు. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైనప్పుడు ఉక్రెయిన్ ఒక సార్వభౌమిక గణతంత్ర రాజ్యంగా ప్రభవించింది. 2014–22 సంవత్సరాల మధ్య ఉక్రెయిన్ ప్రాంతాలు అయిన క్రిమియా, డొనెట్స్క్, లుహన్స్కిలను రష్యా ఆక్రమించుకుని బలవంతంగా తనలో కలిపివేసుకున్నది. తనను వ్యతిరేకించే సైనిక కూటమి 'నాటో' సభ్యత్వానికై ఉక్రెయిన్ దరఖాస్తు చేసుకుందని, ఉక్రెయిన్‌ను ఉపయోగించుకుని నాటో దేశాలు తనను చుట్టుముట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని, తత్కారణంగా తన జాతీయ భద్రతకు ముప్పు ఏర్పడినందునే ఉక్రెయిన్‌ను ఆక్రమించుకోవడం అనివార్యమయిందని రష్యా సమర్థించుకున్నది. ఉక్రెయిన్ ఒక సార్వభౌమిక దేశం. ఆ దేశం నాటోలో చేరినా, చేరకపోయినా స్వతంత్ర దేశంగా మనుగడ సాగించేందుకు ఆ దేశానికి సంపూర్ణ హక్కు ఉన్నది. ప్రపంచ దేశాలు ఆ హక్కును గౌరవించాలి. ఉక్రెయిన్ స్వతంత్ర రాజ్యంగా సంపూర్ణ రక్షణతో మనగలిగేందుకు ప్రపంచం హామీ పడాలి.

మూడేళ్ల క్రితం ప్రారంభమైన యుద్ధం ఉక్రెయిన్ మనుగడకు తీవ్ర హానికరంగా పరిణమించింది. సెప్టెంబర్ 10, 2025 నాటికి రష్యా దాడుల్లో ఉక్రెయిన్‌లో 14,116 మంది పౌరులు మరణించారని, 36,481 మంది క్షతగాత్రులు అయ్యారని ఆ దేశంలో ఉన్న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘం ప్రతినిధులు సమగ్ర సాక్ష్యాధారాలతో నమోదు చేశారు. 56 లక్షల మంది ఉక్రెయిన్ పౌరులు ఇతర దేశాలకు పరారవ్వగా మరో 37 లక్షల మంది పౌరులు దేశంలోనే నిరాశ్రయులు అయ్యారు. ఈ యుద్ధంలో ఉభయ పక్షాలలోను (రష్యా తరపున పోరాడుతున్న కొరియా సైనికులతో సహా) మొత్తం పది లక్షల మందికి పైగా సైనికులు మరణించారు.

ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాలు వందల కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, సైనిక సామగ్రిని సరఫరా చేస్తున్నాయి (ఈ యుద్ధంలో నేరుగా పాల్గొనేందుకు అవి వెనుకాడుతున్నాయి). అయినప్పటికీ ఉక్రెయిన్ యుద్ధంలో ఓడిపోతోంది. అన్ని విధాల భారీనష్టాలు చవిచూస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి చేసి ఈ యుద్ధాన్ని నిలిపివేయగల దక్షత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఉన్నది. అయితే ట్రంప్ అందుకు సుముఖంగా లేడు. ఆత్మ రక్షణకై ఉక్రెయిన్ యుద్ధం చేస్తోంది. నైతికత, న్యాయబద్ధత ఉక్రెయిన్ పక్షానే ఉన్నాయి. అయినా నిస్సహాయంగా నలిగిపోతోంది. అమెరికా ఊగిసలాట ధోరణి, ఐక్యరాజ్యసమితి అసమర్థతకు ఉక్రెయిన్ బలవుతోంది. ఉక్రెయిన్ యుద్ధం పనికిమాలిన, అనైతిక యుద్ధమని ఒక బలమైన దేశం, పొరుగున ఉన్న ఒక బలహీన రాజ్యంపై చేస్తున్న దురాగతం మినహా మరేమీ కాదని చరిత్ర తప్పక నమోదు చేస్తుంది.

ప్రపంచాన్ని అమితంగా కలవర పరుస్తోన్న మరో యుద్ధాన్ని హమాస్ ప్రారంభించింది. పాలస్తీనాలో భాగమైన గాజా ప్రాంతాన్ని పరిపాలిస్తున్న మిలిటెంట్ గ్రూపే హమాస్. ఈ పశ్చిమాసియా ప్రాంతం ఇప్పటికే అనేక యుద్ధాలతో అతలాకుతలమైపోయింది. అక్టోబర్ 7, 2023న హమాస్ ఎలాంటి కవ్వింపు లేకుండా ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇది సమర్థించరాని చర్య. హమాస్ దాడిలో 1200 మంది ఇజ్రాయెలీ పౌరులు మరణించారు. మరో 251 మంది ఇప్పటికీ హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. హమాస్ దాడిపై ఇజ్రాయెల్ భీకరంగా ప్రతిస్పందించింది. ఎడతెగని, బహుముఖీనమైన దాడులు ప్రారంభించింది. గాజా నుంచి పాలస్తీనియన్లు అందరినీ గెంటివేయడమే ఇజ్రాయెల్ లక్ష్యంగా ఉన్నది. పాలస్తీనియన్లు లేని గాజాను పూర్తిగా ఇజ్రాయెల్‌లో కలుపుకోవడమే లక్ష్యంగా ఉన్నది. ఇజ్రాయెల్ ఇప్పటికే మరో పాలస్తీనియన్ ప్రాంతమైన వెస్ట్ బ్యాంక్‌ను చాలావరకు ఆక్రమించుకుని అక్కడి జనజీవనాన్ని నియంత్రిస్తోంది.

> నైతిక అధికారంతో సమస్యలు పరిష్కరించగల జవహర్‌లాల్ నెహ్రూ, డాగ్ హమ్మర్స్క్ జోల్డ్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ లాంటి సమున్నత నాయకులు ఇప్పుడు ప్రపంచానికి అవసరం. ప్రస్తుత ఐక్యరాజ్యసమితి వలే కాకుండా కొత్త అంతర్జాతీయ సంస్థలను నిర్మించుకోవల్సిన అవసరమూ నేడు ప్రపంచానికి చాలా ఉన్నది.

పశ్చిమాసియాలో సుస్థిర శాంతికి ఒక పరిష్కారంగా ఉన్న రెండు దేశాల సిద్ధాంతాన్ని ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 67,000 మంది మరణించారు. వారిలో అత్యధికులు మహిళలు, బాలలే. పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన మౌలిక సదుపాయాలు అన్నీ ధ్వంసమైపోయాయి. ఆహారం,



మంచినీరు, ఔషధాలు అందుబాటులో లేక పాలస్తీనియన్లు చనిపోతున్నారు. హమాస్ దాడికి ప్రతీకారంగానే తాము దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ సమర్థించుకొంటోంది. అయితే ఇది సమర్థించలేని విషయం. ఇజ్రాయెల్ దాడులు మహాభీకరంగా ఉన్నాయి. ఎడతెగకుండా సాగుతున్నాయి. పైగా ఈ దాడుల లక్ష్యం న్యాయవిరుద్ధమైనది.. ఎంతమాత్రం ఆమోదయోగ్యమైనది కాదు. మాతృభూమిని కలిగి ఉండేందుకు పాలస్తీనియన్లకు హక్కు ఉన్నది.

గాజాలో శాంతికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 20 అంశాల 'శాంతి ప్రణాళిక' నొకదాన్ని ప్రతిపాదించారు. ఇజ్రాయెల్ డిమాండ్లను చాలావరకు ఆమోదిస్తున్నట్టు ఈ శాంతి ప్రణాళిక కనిపిస్తున్నది. నేనీ వ్యాసం రాస్తున్న సమయానికి హమాస్ ఆ శాంతి ప్రణాళికను ఆమోదిస్తున్నదీ లేనిదీ తెలియరాలేదు. అన్నీ కోల్పోయి ఆకలి దప్పులతో అలమటిస్తున్న పాలస్తీనియన్లకు శాంతిని సమకూర్చాలంటే ట్రంప్ శాంతి ప్రణాళికను ఆమోదించడం మినహా హమాస్‌కు గత్యంతరం లేదు. అయితే ట్రంప్ శాంతి ప్రణాళికను ఆమోదించడమంటే పాలస్తీనియన్ల భవిష్యత్తును బాహ్యశక్తులకు స్వాధీనం చేయడమే అవుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఇంతకూ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక ప్రకారం పాలస్తీనా 157 దేశాల గుర్తింపుతో ఒక సార్వభౌమిక దేశంగా ప్రభవించేందుకు దోహదం జరుగుతుందా లేదా అన్న విషయమై స్పష్టత లేదు. హమాస్‌ను, పాలస్తీనియన్లను ఒకటిగా చూడడం సమంజసం కాదు. ఏమైనా హమాస్ దుస్సాహసం చాలా అవమానకరంగా ముగిసిందని చెప్పక తప్పదు. అంతేకాదు, పాలస్తీనియన్ల హక్కుల అణచివేత యథావిధిగా కొనసాగుతుంది.

సరే, ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ చాలావరకు సూత్రబద్ధమైన వైఖరిని పాటిస్తూ వస్తోంది. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతిని నెలకొల్పేందుకు ప్రధాని మోదీ ప్రయత్నించారు. అయితే భారత్‌కు 1950లు, 1960ల్లో ఉన్న నైతిక అధికారం, రాజకీయ పలుకుబడి ఇప్పుడు లేవు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం విషయమై భారత్ బాగా తడబడింది. మొదటి నుంచీ పాలస్తీనాకు అన్నివిధాల మద్దతునిస్తున్న భారత్ ఇజ్రాయెల్ వైపు మొగ్గు చూపుతూ వస్తోంది. ఇది ఒక విధంగా పాలస్తీనియన్లను వంచించడమేనని చాలా మంది భావించారు. పలువురు బహిరంగంగా విమర్శించారు. 'రెండు దేశాల ప్రణాళిక' కింద ఉనికిలో ఉండే హక్కు పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండిటికీ ఉందని భారత ప్రభుత్వం సుదీర్ఘకాలంగా వాదిస్తూ వస్తోంది. అయితే ఈ వాదనను విడనాడడం తప్పు అనే విషయాన్ని భారత్ గుర్తించి తన వైఖరిని సరిదిద్దుకునేందుకు ప్రయత్నించింది.

శక్తిమంతమైన దేశాలు, తమను వ్యతిరేకిస్తున్న బలహీన విరోధులపై ఎడతెగని వినాశనకర యుద్ధాలు చేస్తున్నాయనే సత్యాన్ని పాఠకుల దృష్టికి తీసుకు రావడమే ఈ వ్యాసం లక్ష్యం. ఉక్రెయిన్, గాజా యుద్ధాల నిష్ఫలతను కూడా ఈ వ్యాసం ఎత్తి చూపింది. ఇవి వ్యర్థ యుద్ధాలు, ఎవరికీ ఏమీ ఒరిగేదేమీ లేదు. ప్రతి దేశంలోను యుద్ధోన్మాదులు ఉన్నారు. అనేక వివాదాలకు యుద్ధమే పరిష్కారమనేది వారి ప్రగాఢ విశ్వాసం. ఈ యుద్ధోన్మాద వైఖరిని అంతర్గత విభేదాల పరిష్కారానికి కూడా వారు వర్తింపచేస్తున్నారు. దేశీయ వ్యవహారాలలో వివాదాల పరిష్కారానికి 'యుద్ధం'కు ప్రత్యామ్నాయంగా 'హింస'ను ఉపయోగించడాన్ని వారు సమర్థిస్తున్నారు. 'బలవంతులే సరైనవారు' అన్న భావాన్ని వారు అంగీకరిస్తున్నారు. ఇదెలా న్యాయం?

తమ నైతిక అధికారంతో సమస్యలు పరిష్కరించగల జవహర్‌లాల్ నెహ్రూ, డాగ్ హమ్మర్స్క్ జోల్డ్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ లాంటి సమున్నత నాయకులు ఇప్పుడు ప్రపంచానికి అవసరం. వినాశనకర ఘర్షణ పథం నుంచి వైదొలిగేలా కలహించుకుంటున్న దేశాలను మరింతగా ప్రభావితం చేయగల దేశాలు కలిసికట్టుగా ముందుకురావలసిన అవసరం నేడు ప్రపంచానికి ఎంతైనా ఉన్నది. ప్రస్తుత ఐక్యరాజ్య సమితి వలే కాకుండా కొత్త అంతర్జాతీయ సంస్థల అవసరం నేడు ప్రపంచానికి చాలా ఉన్నది. ప్రస్తుతానికి మాత్రం అంతా అంధకారమే, శాంతి కుసుమాల ఉదయం కనుచూపుమేరలో లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఒక 'మత్తు'కి ఇంకో 'మత్తు'.. మందు కాదు!

'ప్రాంతీయ అస్తిత్వం: భ్రమలూ, వాస్తవాలూ!' అన్న జూలై 29 నాటి నా వ్యాసానికి, 'తెలంగాణ పరిరక్షణ వేదిక' వారి సెప్టెంబరు 11 నాటి 'పాత సమాధానం" చూశాను. దానికి, నా వివరణ ఇదీ:

(1) నాది 'పాచి వాదన' అనీ, 'ఆదర్శవాద ముసుగు' అనీ, 'ఆధిపత్య భావన' అనీ, 'పిడివాదన' అనీ వేదిక వారు అన్నారు. అసువంటి మాటలతోని, బహెస్ నడ్వది! కాబట్టి, గా ముచ్చట్లు ఇడిసిపెట్టి, అసల్ నేనేమంటీ, మీరేమంటున్రూ, గా సంగతి చెప్పుకోవాలె! (2) ఒక ప్రాంతంలో ఉన్న రకరకాల అసమానతల్నీ వైరుధ్యాల్నీ ప్రాంతీయ అస్తిత్వ స్పృహ అనే మాయ తెర కప్పివేస్తుంది అనే "ఎరుక మాకు తెలియనిది కాదు" అంటున్నరు వేదిక వాండ్లు! మరి, గా 'ఎరుక'తో నుండాలన్న నాతోని కొట్లాడుడేంది? (3) 'ఎమ్మార్పీఎస్ ఉద్యమం జేస్తున్నం! బీసీ రిజర్వేషన్ల ఉద్యమం జేస్తున్నం!' అని గొప్పలు చెప్పుకుంటున్రు! మోస్ట్ బ్యాక్వార్డ్ షెడ్యూల్ కులాల ఉద్యమాన్ని ఒప్పుకుంటున్రా? అసలు వర్గీకరణనే వ్యతిరేకించే మాల అస్తిత్వవాదుల ఉద్యమం సంగతేంది? "ముస్లింలు, స్త్రీలు, ఆదివాసీలు ఎవరైనా, అందరూ అన్ని పోరాటాలనూ చేయరు" అంటున్రు మీరు. అన్ని పోరాటాలు జయ్యమని ఈడ ఎవ్వరూ అడుగుతలేరు! తాము చేసే ఉద్యమాలు తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించేవి మాత్రమేననీ; భూములూ, గనులూ, ఫ్యాక్టరీలూ, రవాణా లాంటి ఉత్పత్తి సాధనాల్ని స్వాధీనం చేసుకోవాలనే దృష్టి లేకుండా, అసమాన శ్రమ విభజనని పూర్తిగా మార్చుకోవాలనే లక్ష్యం లేకుండా, చేసే యాడ్-హాక్ (తాత్కాలిక) ఉద్యమాలన్నీ, పాలకవర్గాలు ఏర్పాటు చేసిన చట్రంలో ఇరుక్కుపోవడమేననే స్పృహ లేకపోతే జరిగేదేమిటి? "గా ప్రాంతపోల్ల విగ్రహాలు, తీసెయ్యాలె! ఎన్నో సైన్మలు దీసిన మా ప్రాంతపోని ఫోటో గింత చిన్నగనా పెట్టేడిది? మా కార్మికుల శ్రమని దోచే హక్కు మా ప్రాంతపు కాంట్రాక్టర్లకె వుండాలె, గా ప్రాంతపు కాంట్రాక్టర్లకు కాంట్రాక్టులు ఎందు కీయాలె?" అంటే, అది తెలంగాణలోని శ్రామిక ప్రజల ప్రయోజనాలను ఏ రకంగా పరిరక్షిస్తుంది?



> "తెలంగాణ అస్తిత్వం మత్తు కాదు, అది భౌగోళిక విముక్తి" అంటున్నరు వేదిక వాండ్లు! భౌగోళిక శాస్త్రం ప్రకారం, తెలంగాణ ఒక ప్రాంతం కావచ్చు. కానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక శాస్త్రాల ప్రకారం, అనేక అసమానతలతో కూడిన జనసమూహం. కావలిసింది, అసమానతలనించీ విముక్తి!

(4) "మేం ప్రాంత అసమానత గురించి చేస్తున్నం. వర్గ ప్రాతిపదికన చేసే పోరాటానికి ఇవేవీ ఆటంకం కాదు" అని అంటున్రు వేదిక సార్లు! నేనన్నదేంది? ఏ ప్రాంతాన్ని తీసుకున్నా, అది ఆంధ్రాగానీ, తెలంగాన గానీ, రాయలసీమ గానీ, గా ప్రాంతం అంతా ఒక్క తీరుగ లేదు. గా ప్రాంతాలల్ల, అమీరులున్నరు, గరీబులున్నరు. దొరలున్నరు, కూలోల్లున్నరు. మురికి అంటని కొలువులు జేసెటోల్లున్నరు, మురికి, సఫాయి పనులు జేసెటోల్లున్నరు. అందర్నీ, ఒక్కతీరుగనే జూస్తే, గది వర్గపోరాటానికి ఆటంకం కాదా? (5) "బి.ఆర్. బాపూజీ బాధ ఏమిటి?... తమ ప్రాంత ఆధిపత్యం మీద దృష్టి తగ్గుతది అనే" అంటున్నరు వేదిక సార్లు! ఇగో సార్లూ! ఈ బాపూజీ అనేటోనికి ఒక ప్రాంతమంటూ లేదు. వాడు ఆంధ్రోడూ కాదూ, తెలంగానోడూ కాదు! వాడు, కమ్యూనిస్టోడు! వాని భావజాలం 'శ్రామికవర్గ అంతర్జాతీయత'! అంటే, అన్ని దేశాల కార్మికులూ ఒక్కటిగావాలె! (6) "అంబేడ్కర్ తదితరులు ప్రాంతాలకతీతంగా దేశం మొత్తానికీ ఐకన్స్" అని అంటున్నరు వేదిక వాండ్లు. అసలు గీ 'ఐకాన్స్' అనే ముచ్చటెక్కడికెల్లొచ్చింది? మనుషుల్ని 'ఐకన్స్' అనీ, 'వైతాళికులు' అనీ, సమానత్వ సూత్రానికి విరుద్ధంగా, నిలబెట్టడమే అసలైన 'ఆధిపత్య భావన!' (7) విగ్రహ తరలింపు ఉద్యమం ద్వారా, తెలంగాణను పరిరక్షించాలనుకుంటున్న వేదిక వారు, "మీ కాసు బ్రహ్మానందరెడ్డి, మీ ఎన్టీఆర్, మీ రాజశేఖరరెడ్డి, మా మర్రి చెన్నారెడ్డి, మా పి.వి. నరసింహారావు, మా అంజయ్య..!" అనుకుంట నా మీద కోపమైతాంద్రు. ఓ సార్లూ! విగ్రహాలనేవీ సమానత్వ సూత్రానికి విరుద్ధమనీ, హేతువిరుద్ధమనీ, ఒక కళా రూపంగా మాత్రమే వాటిని చూడాలనీ, ఎవరి విగ్రహాన్నయినా చేసినా, చేయించినా, దాన్ని ప్రకృతి వైపరీత్యాలనించీ, సామాజిక శత్రువులనించీ కాపాడుకోగలిగేలా, ఏర్పాట్లు చేసుకోవాలనీ చెపితే, 'గది మీ ప్రాంతపోని విగ్రహం! గిది మా ప్రాంతపోనిది!'– అని, గీ మాటలెందుకు జప్పుండ్రి!

(8) రాజశేఖరరెడ్డి 'పేరెత్తిండ్రుగదా మీరు? మీకు యాదికున్నదో లేదో, ఒక ముచ్చట జప్తా ఇనుండ్రి! 2009లో తెలంగాణలో ఎన్నికల ప్రచారం అయినంక, రాయలసీమల ప్రచారం మొదలు బెట్టేతప్పుడు, "ప్రత్యేక తెలంగాణ వస్తే, రాయలసీమ వాళ్ళు విదేశీయులుగా బతకవలిసి వస్తుందని" అన్నడు. అప్పుడు, నేను, గిదే బాపూజీని, 'ఆధిపత్య భావన' గలిగినోన్ని, గిట్ల రాసిన: "తన పాలనలో, సెజ్‌ల యజమానులకు ఆర్థికంగా, రాజకీయంగా, దళారీగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నేతలలో అగ్రగణ్యుడైన ముఖ్యమంత్రి, ప్రత్యేక తెలంగాణ భూతాన్ని చూపడం మాత్రం, ఒక దళారీ దేశభక్తిని ప్రదర్శించడం లాంటిదే!" (ఆంధ్రజ్యోతి, 19-4-2009). (9) "ఆధిపత్య అహంకారానికి 'అస్తిత్వం మత్తే' సరైన జవాబు" అని వేదిక వాండ్ల ఆత్మ సమర్థన! కానీ, ఒక మత్తుకి ఇంకో మత్తు.. మందు కాదు! అస్తిత్వాలలో ఉప అస్తిత్వాలూ, ఉప-ఉప అస్తిత్వాలూ ఉన్నాయనీ, వాటి మధ్య అసమానతల్ని ఈ శ్రమ దోపిడీ సమాజం ప్రోత్సహిస్తుందనీ గ్రహింపు లేకపోతే ఎట్ల? (10) "తెలంగాణ స్ఫూర్తిదాతల విగ్రహాల లిస్ట్ కుల మత, లింగ భేదాల్ని బట్టి నిష్పత్తితో సహా సిద్ధంగా ఉంది" అని, ఐలాన్ జేసిండ్రు వేదిక సార్లు! ముందు, వర్గీకరణలోనూ, బీసీ రిజర్వేషన్లలోనూ నిష్పత్తులు తేలాలి గదా? అప్పుడే లిస్టు ఎట్ల సిద్ధంగున్నది? (11) "తెలంగాణ అస్తిత్వం మత్తు కాదు, అది భౌగోళిక విముక్తి" అంటున్నరు వేదిక వాండ్లు! భౌగోళిక శాస్త్రం ప్రకారం, తెలంగాణ ఒక ప్రాంతం కావచ్చు. కానీ, ఆర్థిక, రాజకీయ, సాంఘిక శాస్త్రాల ప్రకారం, అనేక అసమానతలతో కూడిన జన సమూహం. కావలిసింది, అసమానతలనించీ విముక్తి!

● బి.ఆర్. బాపూజీ

(చర్చ ముగిసింది)

మెరుగుపడని ఉపాధ్యాయుల హోదా

ఉపాధ్యాయుల హక్కులు, బాధ్యతలను, వారి హోదా పెంచడానికి 145 అంశాలతో, కొన్ని నిర్దిష్టమైన సిఫార్సులతో 1966లో 'స్టేటస్ ఆఫ్ ద టీచర్స్' అనే విధానపత్రాన్ని పారిస్‌లో జరిగిన సమావేశంలో యునెస్కో, అంతర్జాతీయ కార్మిక సంస్థ రూపొందించాయి. ఈ పత్రాన్ని ఆమోదించిన అక్టోబర్ 5వ తేదీని ఐక్యరాజ్యసమితి 'ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం'గా ప్రకటించింది. అయితే ఉపాధ్యాయుల అంతస్తు సాధనకు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా వారు ఉద్యమించాల్సి వస్తోంది. మానవాభివృద్ధిలో ఉపాధ్యాయులది ప్రముఖ పాత్ర. విద్యా సంబంధ లక్ష్యాలు, ప్రయోజనాల సాధనకు, ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు, గౌరవం తెచ్చేందుకు ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

విద్యా రంగానికి, ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన నియామకాలు, ఎంపిక, శిక్షణ, వృత్తి సంబంధమైన ప్రమాణాలు, వృత్తి భద్రత, హక్కులు, బాధ్యతలు, వృత్తిపరమైన స్వేచ్ఛకు సంబంధించిన అంశాలు పారిస్ సభ సిఫార్సులలో పొందుపరిచారు. వీటితో పాటు వేతనాలు, సెలవులు, స్టడీ లీవు, పనివేళలు, పని పరిస్థితులు, బోధనోపకరణాలు, తరగతి పరిమితి, గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధ్యాయుల స్థితిగతులు, మహిళా ఉపాధ్యాయుల పరిస్థితులు, వైద్య సౌకర్యాలు, పెన్షన్‌కు సంబంధించిన అంశాలు వగైరాలు కూడా అందులో ఉన్నాయి. మూడు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో విద్య వాణిజ్యీకరణ, ప్రైవేటీకరణ పెరుగుతోంది. విద్యకు కేటాయించే నిధుల పరిమాణం తగ్గిపోతోంది. ప్రభుత్వ విద్యారంగానికి తగ్గిపోతున్న నిధులు, విద్యా ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా సంస్థలకు నిధుల కేటాయింపు పెంచాలని ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఉపాధ్యాయులు బోధన వదిలి ఉద్యమించాల్సి వస్తోంది.

ఉపాధ్యాయుని అంతస్తుకు సంబంధించిన ఈ సిఫార్సుల పట్ల చట్టరీత్యా ప్రభుత్వాలు కట్టుబడిలేవు. అయినా అవి ఆయా దేశాలపై చెప్పుకోదగ్గ నైతిక రాజకీయ ఒత్తిడిని కలిగిస్తాయి. పారిస్ సభ సిఫార్సులు అమలు జరిపి ఉంటే అనేక దేశాల్లో విద్యారంగం పరిస్థితి మెరుగై ఉండేది. వీటి అమలుకు అంతర్జాతీయ ఉపాధ్యాయ ఉద్యమం, జాతీయ ఉపాధ్యాయ సంఘాలు కూడా ఆయా ప్రభుత్వాలపై తగిన ఒత్తిడి తేలేదు. ప్రపంచవ్యాప్తంగా 9.4 కోట్ల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 2030 వరకు ప్రపంచ విద్యా అవసరాలు తీరాలంటే, అందరికీ విద్య అందించాలంటే ఇంకా 4.4 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరం. దేశంలో ఇంకా 10 లక్షల మంది ఉపాధ్యాయుల కొరత ఉందని నీతి ఆయోగ్ నివేదిక చెప్తోంది. 'స్టేటస్ ఆఫ్ టీచర్స్' విధానపత్రం ఆమోదం పొందిన 60 సంవత్సరాలకు కూడా ఉపాధ్యాయుల పరిస్థితులు హీనస్థితిలో ఉన్నాయని, అధిక వేతనాలు ఇచ్చే ఉద్యోగాలకు ఉపాధ్యాయులు వెళ్లిపోతున్నారని ఐఎల్‌ఓ నివేదిక చెప్తోంది. ఈ పరిస్థితుల్లో యువత ఉపాధ్యాయ వృత్తి స్వీకరించడానికి స్టేటస్ ఆఫ్ ద టీచర్స్ పత్రంలో సూచించిన విధంగా ఉపాధ్యాయుల అంతస్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి. అదే ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు గురువులకు ఇచ్చే గౌరవం.

– కె. వేణుగోపాల్, విద్యారంగ విశ్లేషకులు

(రేపు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం)

అయోమయం అమెరికన్ జాబ్ మార్కెట్!

ఇతర దేశాలకు చెందిన దిగ్గజ టెక్ కంపెనీలు అమెరికాలో వివిధ సంస్థల ప్రాజెక్టులను చేపడుతుంటాయి. ఆ కంపెనీల ప్రణాళికలను బట్టి నియామకాలు, తొలగింపులు చేపడతాయి. అప్పటిదాకా ఆ ప్రాజెక్టుల్లో ఉండే అమెరికా పౌరులు కూడా కొన్ని సందర్భాల్లో ఉద్యోగాలు కోల్పోవడం జరుగుతూ ఉంటుంది. అమెరికాలోని ఐటీ రంగం మీద విదేశీ టెక్ కంపెనీల గుత్తాధిపత్యం, దరిమిలా అమెరికన్ యువత అవకాశాలు కోల్పోతూ ఉండటం ట్రంప్‌నకు ఆగ్రహం కలిగించినట్లు ప్రచారం అవుతోంది. ఆయన తాజా నిర్ణయాల్లో అమెరికాయేతర కంపెనీల మీద ప్రతీకారేచ్ఛ గోచరించడానికి కారణం ఇదే.

ట్రంప్ అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచి ఇవాళ్టి దాకా స్థిరంగా ఉన్న సమస్య అమెరికాలోని జాబ్ మార్కెట్! నిజానికి ఈ సమస్య రోజురోజుకూ కొండలా పెరిగిపోతున్నది. సాధారణంగా జాబ్ మార్కెట్ అంటే– కొత్తవారికి దక్కే ఉద్యోగావకాశాల గురించేనని అనుకుంటాం. కానీ ఇప్పుడు అమెరికాలో సీనియర్లకు కూడా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వారి మెడపై కూడా కత్తి వేలాడుతోంది. పెద్ద కంపెనీలు ఎంతో కాలంగా సంస్థలోనే కొనసాగుతున్న, కీలక స్థానాలకు చేరుకున్న ఉద్యోగులను కూడా నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నాయి. ఇరవై-పాతికేళ్ల అనుభవం ఉన్నవారు కూడా హఠాత్తుగా ఉద్యోగాలు కోల్పోతున్నారు. కొన్ని సంస్థల్లో డైరక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ల స్థాయికి చేరుకున్న వారి పరిస్థితి కూడా కుదురుగా లేదు. ఏ క్షణాన్నయినా ఉద్యోగం పోవచ్చునన్న భయం ప్రతి ఒక్కరినీ వెన్నాడుతోంది. ఒక సీనియర్‌ను ఉద్యోగం నుంచి తప్పిస్తే, అదే వేతనానికి ముగ్గురు నలుగురు ఫ్రెషర్స్‌ను తీసుకోవచ్చుననే సంస్థల ఆలోచనా సరళి, పర్యవేక్షక స్థాయి ఉద్యోగాల అవసరం అంతకంతకూ తగ్గుతుండడం ఇందుకు మరోకారణం.

ఉద్యోగాలు కోల్పోతున్న సీనియర్లకు కొత్త ఉద్యోగాలు దొరకడం కష్టమవుతోంది. ఒక ఉద్యోగంలో సీనియారిటీ గడించడం అంటే– అక్కడ అవసరమైన మూస పనికి అలవాటు పడి ఉండటం. అలాంటి వారికి ఉద్యోగం పోయి జాబ్ ప్రొఫైల్ మారితే అందుకు తగినట్టు ఎడ్జస్ట్ కావటం సులువు కాదు. ఐటీ రంగంలో రోజు రోజుకూ మారే సాంకేతికతకు అప్‌డేట్ కానివారికి మళ్ళీ ఉద్యోగం దొరకడం మరీ కష్టం అవుతున్నది. చాలా కాలం కిందటే అమెరికాలో స్థిరపడిన వారి పరిస్థితి దయనీయం. వారు ఉద్యోగం పోగానే ఖాళీగా ఉండలేక ఏదైనా వ్యాపారంలోకి ప్రవేశించి అక్కడ అనుభవం లేక చేతులు కాల్చుకుంటున్నారు. అమెరికాలో వ్యాపారాల పరిస్థితి సైతం సజావుగా లేకపోవడం మరో సమస్య.

సాధారణంగా ఐటీ ఉద్యోగులు తరచుగా ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మారుతూ ఉంటారు. ఇలా మారడం వలన త్వరత్వరగా వేతనాల మెట్లు ఎక్కుతూ వెళ్లవచ్చునని భావిస్తారు. ఈ పోకడను జాబ్ హాపింగ్ (Job hopping) అంటారు. ప్రస్తుతం ఉన్న

> అమెరికాలో ఉద్యోగ సంక్షోభం ఆ దేశానికే పరిమితం కాదు. దీని ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల మీద ఉంటుంది.



వాతావరణంలో ఎవ్వరూ ఈ ఆలోచనను దరిదాపులకు రానివ్వటం లేదు. ఉన్న ఉద్యోగం వదిలేస్తే మరొకటి దొరకబుచ్చుకోవడం సాధ్యం కాదనే భయం వారిని నిలువరిస్తున్నది. ఉద్యోగాలు ఇప్పించే కన్సల్టెన్సీల స్థితి కూడా కష్టంగా ఉన్నది. పేరోల్స్ రన్ చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

ఎన్నారైలకు సంబంధించినంత వరకు, అమెరికాలో ఉద్యోగ సంక్షోభం ఈ దేశానికే పరిమితం కాబోదు. ఎన్నారై తెలుగువారి సంఖ్య అమెరికాలో గణనీయంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాల మీద కూడా పడుతుంది. ట్రంప్ విధించిన సుంకాలు, ఆయన పరిపాలన తీరు భారతదేశం నుంచి జరిగే అన్ని రకాల ఎగుమతులపై ప్రభావం చూపించడం సహజం. వజ్రాలు, వస్త్రాలు, ఫార్మా, ఆంధ్రప్రదేశ్ విషయంలో రొయ్యల ఎగుమతులపై సుంకాల ప్రభావం కనిపిస్తూనే ఉంది. అన్నిటికంటే ముఖ్యంగా– అమెరికన్ జాబ్ మార్కెట్ దెబ్బతినడం వల్ల ఎన్నారైల నిధుల వరద ఇండియాకి తగ్గి రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొనే ప్రమాదం అధికం. అమెరికాలో స్థిరపడిన తెలుగువారు తమ మిగులు ఆర్జనతో స్వంత రాష్ట్రాల్లో ఆస్తుల కొనుగోలుకు మొగ్గు చూపుతారు. ఎక్కువమంది హైదరాబాదులో ఒక మంచి గేటెడ్ కమ్యూనిటీలో విల్లా కొని తల్లిదండ్రులను అక్కడ ఉంచాలని అనుకుంటారు. అలాగే తాము ఏడాదిలో ఒకసారి వచ్చి గడపడానికి హైదరాబాదు గేటెడ్ కమ్యూనిటీలను ఎంచుకుంటారు. ఆ మాటకొస్తే ఎన్నారై కొనుగోలుదారుల్ని లక్ష్యంగా పెట్టుకునే వెలిసిన వెంచర్లు హైదరాబాదు శివార్లలో అనేకం. ఇప్పుడు ఎన్నారైలు అమెరికా జాబ్ మార్కెట్‌లో అనిశ్చితి కారణంగా స్వదేశంలో పెట్టుబడులకు ధైర్యం చేయలేకపోతున్నారు. వీసా ఫీజుల పెంపు వంటి నిర్ణయాల వల్ల భారతీయ సంస్థలకు కొత్తగా భారీ ఎదురుదెబ్బ తగిలిందని అనుకోనక్కరలేదు. కోవిడ్ అనంతర పరిణామాల నుంచి అమెరికన్ మార్కెట్ పెద్దగా కోలుకున్నది లేదు. పాతవారి తొలగింపులు, కొత్తవారికి ఉద్యోగాలు లేని స్థితి ఇప్పటికే ఉంది. అయితే, ఇప్పటివరకూ పెద్ద కంపెనీలు తమకు ప్రాజెక్టులు వచ్చినప్పుడు అప్పటికప్పుడు ఉద్యోగుల వెతుకులాట అవసరం లేకుండా, ముందుగానే హెచ్1బి వీసాలు ప్రాసెస్ చేయించి సిద్ధంగా ఉంచుకొనేవి. వీసా ఫీజుల పెంపు నిర్ణయం ఈ పద్ధతిని దెబ్బ తీస్తోంది. వీసా, వేతనం, లాటరీ మధ్య లింకుపెట్టిన ట్రంప్ చర్యలు చిన్న కంపెనీలకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలు ఎప్పటికప్పుడు మారిపోతూండటం కూడా ఈ రంగంలో అనిశ్చితికి, గందరగోళానికి కారణమవుతోంది. ప్రశాంతత ఎప్పటికి సాధ్యమో చెప్పలేని స్థితి.

■ కృష్ణమోహన్ దాసరి
పాత్రికేయుడు, డల్లాస్





జాతిపితకు ఘన నివాళి

జాతిపిత మహాత్మా గాంధీజీకి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన నివాళులర్పించారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా నెల్లూరులోని కలెక్టరేట్, గాంధీబొమ్మ వద్ద విగ్రహాలకు నివాళులర్పించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ, స్వచ్ఛంద తదితర కార్యాలయాల్లోనూ గాంధీ చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించి, ఆయన సేవలను కొనియాడారు.

17,406 మందికి 'ఆటోడ్రైవర్ల సేవలో'

- నేడు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ



నెల్లూరు (క్రైం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. ఆటోడ్రైవర్లకు లబ్ధి చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా ప్రతి డ్రైవర్‌కు రూ.15వేలు చొప్పున ప్రతి ఏడాది అందజేయనున్నారు. ఈ మేరకు ఆటోడ్రైవర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అధికారులు తుదిజాబితాను వెల్లడించారు. జిల్లాలో ఈ పథకానికి 17,406 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. శనివారం వీరందరి ఖాతాల్లో నగదు జమకానుంది. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో కూటమి నాయకులు, అధికారులు 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించనున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఆటోల ర్యాలీలో పాల్గొననున్నారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాది 16,516 మందికి మాత్రమే వాహనమిత్ర పేరుతో రూ.10వేలు చొప్పున నగదు జమ చేసింది. ప్రస్తుత ప్రభుత్వంలో లబ్ధిదారుల సంఖ్య పెరగడంతోపాటు వారికి ఇచ్చే నగదు కూడా పెరగడం విశేషం.

నియోజకవర్గం	లబ్ధిదారులు
నెల్లూరు రూరల్	3441
సర్వేపల్లి	2651
కోవూరు	2585
కావలి	1888
నెల్లూరు అర్బన్	1821
ఆత్మకూరు	1636
ఉదయగిరి	1406
కందుకూరు	1004
వెంకటగిరి (3 మండలాలు)	974

- నెల్లూరులో వినూత్న ప్రయోగానికి శ్రీకారం
- ఏఐ టెక్నాలజీతో డ్రోన్ల ద్వారా నగరంలో సర్వే
- దోమల పునరుత్పత్తి ప్రాంతాల గుర్తింపు
- డ్రోన్ల ద్వారానే నివారణ లిక్విడ్ స్ప్రే
- ఫాగింగ్ యంత్రాలకూ జీపీఎస్
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం



వర్షాకాలం వస్తే నెల్లూరులో దోమల దెబ్బ ఎలా ఉంటుందో నగరవాసులందరికీ అనుభవమే. కార్పొరేషన్ ఎన్ని నివారణ చర్యలు తీసుకున్నా దోమలు మాత్రం తగ్గనంటున్నాయి. ఈ పరిస్థితులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం.. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లలో దోమల నివారణకు సరికొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీను ఉపయోగించేలా నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి విధివిధానాలను జారీ చేసింది. ఈ ఏఐ టెక్నాలజీని నెల్లూరులోనూ ప్రవేశపెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు.



దోమలపై ఏఐ ఫోకస్!

నెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకూ దోమల నివారణకు వీధుల్లో ఫాగింగ్ చేయడం, కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం జరుగుతుండేది. ఇందుకోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పూర్తిస్థాయిలో దోమల నివారణ సాధ్యపడటం లేదు. అందుకు ప్రధాన కారణం ఖాళీ స్థలాలు, మురుగు ప్రాంతాలు. వీధుల్లోనూ, కాలువల్లోనూ కార్పొరేషన్ సిబ్బంది నివారణ చర్యలు చేపడుతున్నా రిమోట్ ప్రాంతాల్లోకి వీరు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంది. ఇటువంటి ప్రాంతాలు దోమల పునరుత్పత్తికి ఆవాసాలుగా మారుతున్నాయి. వీటిని నేరుగా గుర్తించడం కూడా సిబ్బందికి కష్టంగా ఉంటోంది. ఈ క్రమంలో 'ఏఐ బేస్ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్' తీసుకొచ్చారు. ఇందులో డ్రోన్ల ద్వారా నగరం మొత్తం పరిశీలిస్తారు. ఎక్కడెక్కడ ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉంటోంది? ఎక్కడ దోమల పునరుత్పత్తి జరుగుతోంది? వంటి ప్రాంతాలను గుర్తిస్తారు. మనుషులు వెళ్లలేని ప్రాం తాలకు డ్రోన్లను పంపుతారు. ఈ డ్రోన్ల ద్వారా ఫాగింగ్ చేస్తారు. అలానే ఇటువంటి ప్రాంతాలన్నిటినీ సర్వేలెన్స్‌లో ఉంచుతారు. ఒకసారి ఫాగింగ్ చేసి వదిలేయడం కాకుండా నిరంతరం మానిటరింగ్ చేస్తూ దోమల నివారణకు చర్యలు చేపడతారు. డ్రోన్లకు జీపీఎస్‌ను అమర్చి కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. అక్కడ నుంచే అధికారులు నేరుగా పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫాగింగ్ యంత్రాలకూ జీపీఎస్

ఇక రెగ్యులర్‌గా జరుగుతున్న ఫాగింగ్ ప్రక్రియలో కూడా మార్పులు తీసుకురాబోతున్నారు. కొందరు సిబ్బంది తూతూమంత్రంగా ఫాగింగ్ చేసి మమ అనిపిస్తున్నారు. దోమల నివారణ జరగకపోవడానికి ఇది కూడా ఒక కారణంగా అధికారులు గుర్తించారు. తమ ప్రాంతాల్లో ఫాగింగ్ చేయడం లేదంటూ తరచూ ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ సమస్యకు కూడా చెక్ పెడుతూ ఫాగింగ్ యంత్రాలకు కూడా జీపీఎస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. నెల్లూరు కార్పొరేషన్ వద్ద 50 ఫాగింగ్ యంత్రాలు ఉండగా, తొలుత 10 యంత్రాలకు జీపీఎస్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ జీపీఎస్‌లు అన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానిస్తారు. అక్కడనుంచి అధికారులు ఫాగింగ్ ఎలా జరుగుతోందన్నది పర్యవేక్షిస్తారు. ఈ కొత్త టెక్నాలజీ కోసం దాదాపు రూ.40 లక్షలను ఖర్చు చేయనున్నారు.



సంగంలో రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చిన కామాక్షిదేవి



దసరా సెలవులు ముగియడంతో శుక్రవారం నెల్లూరు బస్టాండులో రద్దీ

సంబరంగా దసరా

- కన్నుల పండువగా నగరోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను గురువారం జిల్లావ్యాప్తంగా ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. ఆలయాల్లో విజయదశమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం అభిషేకాలు, విశేష నవావరణపూజలు జరిగాయి. సాయంత్రం శమీపూజ, పారువేట ఉత్సవాలు జరిగాయి. విద్యుద్దీపాలు, విశేష పుష్పాలంకరణ, బాణాసంచా, మంగళ వాయిద్యాలతో నగరోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. నెల్లూరులో రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి, కన్యకాపరమేశ్వరి, బుచ్చిరెడ్డిపాళెం మండలంలో జొన్నవాడ కామాక్షితాయి, రాపూరు మండలం పెంచలకోన, నెల్లూరు రూరల్ మండలం నరసింహులకొండ, కావలి కలుగోళమ్మ తదితర ప్రముఖ ఆలయాల్లో విజయదశమి ఉత్సవాలు ఘనంగా చేశారు. అమ్మవారి నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయం, వాణిజ్య దుకాణాల్లో ఆయుధ పూజలు కూడా జరిగాయి.



నెల్లూరు : రాజరాజేశ్వరి ఆలయంలో భక్తుల సందడి



నెల్లూరు : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర.. జిల్లాకు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు

- జిల్లాస్థాయిలో 48 అవార్డులు : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద పరిశుభ్రత రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు రాష్ట్రస్థాయిలో జిల్లాకు రెండు, జిల్లాస్థాయిలో 48 అవార్డులు వచ్చాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అవార్డు గ్రహీతలను ఈ నెల 6న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానిస్తారని తెలిపారు. ఇక రాష్ట్రస్థాయిలో ఆత్మకూరు మున్సిపాలిటీ, స్వచ్ఛత వారీయర్‌గా పద్మావతి ఎంపికవగా, ఈ నెల 6న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ఈ అవార్డులను అందుకోనున్నారు.

ఆత్మకూరుకు అరుదైన ఘనత



ఆత్మకూరు : పరిశుభ్రత, పారిశుధ్యం, అభివృద్ధి చర్యల్లో ప్రతిభ కనబరిచిన ఆత్మకూరు మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ఇంటింటా వ్యర్థాల సేకరణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీ, డ్రైవేస్ట్(ఎంఆర్ఎఫ్) ప్రాసెసింగ్, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణ, మెప్మా ద్వారా మిద్దెతోటలను ప్రోత్సహించడం, మొక్కల పెంపకం, లెగసీ వేస్ట్ క్లియరింగ్ తదితర కేటగిరిల్లో 50 వేలు లోపు జనభా కలిగిన మున్సిపాలిటీల్లో ఆత్మకూరు ముందంజలో నిలిచింది. 23 వార్డులు, 32,556 మందికి పైబడి ఉన్న ఆత్మకూరులో 63 కి.మీ పొడవున పక్కా డ్రైన్, 48 కి.మీ ఖచ్చా డ్రై ఉన్నాయి. ఇటీవల వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, ప్రజా అవగాహన ద్వారా ఆత్మకూరు మున్సిపాలిటీ పురోగతిని సాధించింది. ఆత్మకూరుకు ఈ అవార్డు దక్కడంపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛతా వారీయర్‌గా పద్మావతి



నెల్లూరు (సిటీ) : స్వచ్ఛతా వారీయర్‌గా 45వ డివిజన్‌కు చెందిన పారిశుధ్య కార్మికురాలు తాటిపర్తి పద్మావతిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. గత నెల 17వ తేదీ నుంచి వరుసగా స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా పురపాలక శాఖ నిర్వహించింది. ఇందులో భాగంగా స్వచ్ఛత వారీయర్‌గా పద్మావతిని ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతిలో సీఎం చేతుమీదుగా అవార్డును అందుకోనున్నారు.

4 రోజులు.. రూ.30 కోట్లు

- పండుగ రోజుల్లో భారీగా మద్యం అమ్మకాలు

తేదీ	ఐఎంఎల్ (కేసులు)	బీర్లు (కేసులు)	ధర (రూ.లలో
29-9-25	15058	5835	10.95కోట్లు
30-9-25	14499	4792	10.23కోట్లు
1-10-25	2801	1067	2.04కోట్లు
మొత్తం	32358	11696	23.22కోట్లు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ రోజుల్లో జిల్లావ్యాప్తంగా మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. పండుగ రోజు గాంధీ జయంతి రావడంతో బార్లు, మద్యం దుకాణాలు మూత పడినా ముందు రోజే మందుబాబులు మద్యం కొనుగోలు చేయడం, బ్లాక్‌లో మద్యం అమ్మకాలు సాగడంతో పండుగ రోజుల్లో మద్యం ఏరులై పారింది. సహజంగా జిల్లాలో రోజుకు సుమారు రూ.4 కోట్ల మద్యం స్టాక్ డిపో నుంచి మద్యం దుకాణాలు, బార్లకు వెళుతుంది. అయితే గత నెల 29 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు రూ.23.22 కోట్ల మద్యం డిపో నుంచి బయటకు వచ్చిందని అధికారులు తెలుపుతున్నారు. ఇక మంగళవారం ఒక్కరోజే సుమారు రూ.7 కోట్లకుపైగా మద్యం డిపో నుంచి బయటకు వచ్చినట్లు సమాచారం. మొత్తం మీద గత నెల 29 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు సుమారు రూ.30 కోట్ల మద్యం డిపో నుంచి బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది.

ఆవేశంలో హత్యలు

- కన్న కొడుకునే రోకలి బండతో కొట్టిన కసాయి తండ్రి
- తల్లిని కొట్టొద్దన్నందుకు ముదివర్తిలో దారుణం!
- పాతకక్షలతో దారకానిపాడులో యువకుడు..
- కారుతో బైక్‌ను బలంగా ఢీకొట్టి ఘాతుకం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆవేశం రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. భార్యను కొడుతుంటే అడ్డొస్తున్నాడని కన్న కొడుకునే దారుణంగా హత్య చేశాడో కసాయి తండ్రి. పాత కక్షలను మనసులో పెట్టుకుని బైక్‌పై వెళుతున్న యువకుడిని కారుతో బలంగా ఢీకొట్టి అతని మరణానికి కారణమయ్యాడు ఇంకో కఠినాత్ముడు. విడవలూరు మండలం ముదివర్తి, గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామాల్లో జరిగిన ఈ దారుణాలు ఆయా పల్లెల్లో విషాదాన్ని నింపాయి.

- వివరాలు 8లో...

ఈ భావి వైద్యురాలికి ఏ కష్టమొచ్చింది!?

- ప్రభుత్వ వైద్యకళాశాలలో వైద్యవిద్యార్థిని ఆత్మహత్య



దసరా సెలవుల్లో స్నేహితురాలితో సరదాగా గడిపింది. ఆ తర్వాత సొంతూరులో తల్లిదండ్రులతోనూ ఆనందం పంచుకుంది. ప్రాక్టికల్స్ పరీక్షల కోసం పండుగ నాడే నెల్లూరుకు చేరుకుంది. పరీక్షలకు ముందు కూడా హాస్టల్ గదిలో స్నేహితురాలితో నవ్వుతో మాట్లాడింది. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో... ఆ భావి వైద్యురాలికి ఏ కష్టమొచ్చిందో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వైద్య విద్యార్థులు, మృతురాలి బంధువుల్లో తీవ్ర విషాదం నింపింది.

- వివరాలు 8లో...

భాషా పండితులకు ఊరట

- న్యాయస్థానం ఆదేశాలతో ఉద్యోగోన్నతులు



పండిట్‌లకు ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందిస్తున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు (విద్య), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల పోరాట ఫలితం, న్యాయస్థానం ఆదేశాలతో జిల్లాలో పండిట్‌లకు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఉన్న భాషోపాధ్యాయులకు (తెలుగు, హిందీ, ఉర్దూ) 2019లో ఉన్నతీకరణ జరిగింది. 2017లో ఇచ్చిన జీఓ నెం 91ను గత వైసీపీ ప్రభుత్వం పక్కనపెట్టి జీఓ నెం 77ను ప్రవేశ పెట్టింది. దీంతో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పదోన్నతి పొందగా అర్హులైన భాషా పండితులు అవకాశాన్ని కోల్పోవడంతోపాటు ఎల్‌పీ కేడర్ లేకుండా పోయింది. భాషాపండితులను డీఈఓ పూల్ కింద పరిగణించి వర్క్ అగైనెస్ట్ వేతనాలతో విధులు కేటాయిస్తున్నారు. దీంతో జిల్లాలో భాషోపాధ్యాయుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పదోన్నతులు వీరికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ప్రస్తుతం జిల్లాలో జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 71 మంది తెలుగు, ఏడుగురు హిందీ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో ఏడుగురు హిందీ పండిట్‌లు ఉన్నారు. అయితే సాధారణ ఉపాధ్యాయుడికి ఒకసారి బదిలీ అయితే జిల్లాలో ఏదైనా పాఠశాలలో కనీసం 8 ఏళ్ల పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. డీఈఓ పూల్‌లో ఉన్న భాషోపాధ్యాయులకు మాత్రం బదిలీలు జరిగిన ప్రతిసారీ బదిలీలకు గురవుతున్నారు. దీనిపై గత ప్రభుత్వంలో భాషా పండితులు న్యాయస్థానాలను ఆశ్రయించగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

85 మందికి ఉద్యోగోన్నతులు

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు 87 మంది భాషా పండిట్‌లలో 85 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ డీఈఓ బాలాజీరావు ఉత్తర్వులు జారీ చేశారు.

కరెంటు బిల్లులోనే 'ట్రూఅప్' తగ్గింపు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నవంబరు నెల నుంచి కరెంటు బిల్లులోనే ట్రూ డౌన్ చార్జెస్ జమ అవుతాయని విద్యుత్ శాఖ ఎస్ఈ కే రాఘవేంద్రం తెలిపారు. విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ట్రూఆప్ చార్జీలు తగ్గించడం వల్ల 32.24 కోట్ల రుపాయలు వినియోగదారులకు అందుతుందన్నారు.

'సోమశిల'కు 25,205 క్యూసెక్కుల వరద

అనంతసాగరం అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 25,205 క్యూసెక్కుల వరద కొనసాగింది. దీంతో డ్యాంలో 72.965 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 22,800, ఉత్తర కాలువకు 100, కండలేరుకు 4వేల క్యూసెక్కు నీటిని సరఫరా చేస్తున్నారు.

ప్రధాన ఆలయ కమిటీల్లో జిల్లా వాసులు

నెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల ట్రస్టు బోర్డులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీల్లో జిల్లాకు చెందిన వారు చోటు దక్కించుకున్నారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యునిగా కావలికి చెందిన ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడిగా కోవూరుకు చెందిన వేమిరెడ్డి కోటారెడ్డి నియమితులయ్యారు. అలానే శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నెల్లూరు సిటీకు చెందిన కొమరి విజయమ్మను ఎంపిక చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11173
వెండి కిలో ధర	రూ. 149400
వెండి ఒక గ్రాము	రూ. 153.40

నిత్యాన్నదానానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న చిన్న రాఘవయ్య

రాపూరు, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : పెంచల కోనలోని శ్రీవారి శాశ్వత నిత్యాన్న పథకానికి గురువారం రూ. 1,50,000 విరాళం అందినట్లు ఆలయ అధికారులు తెలిపారు. తిరుపతి రూరల్ తోటపల్లి గ్రామ వాస్తవ్యులు సమయం విజయలక్ష్మి జ్ఞాపకార్థం భర్త చిన్న రాఘవయ్య, కుమారులు నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయలు అందించారు. నెల్లూరు వాస్తవ్యులు కొర్రపాటి వేణుగోపాల్, సాయి రోహిత్ కలిసి యాభై వేల రూపాయలు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి అందచేశారు. వీరికి ఆలయ మర్యాదలతో మూడు అలయాల్లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలు అందచేశారు.

మెప్మాకు రాష్ట్రస్థాయి గుర్తింపు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలోని మెప్మాలోని 4వ సమాఖ్యలో టెర్రస్ గార్డెన్స్ ఏర్పాటులో పలు రకాల కూరగాయలు, పూలమొక్కల పెంపకంపై బుచ్చి మెప్మాకు స్వచ్ఛాంధ్రలో రాష్ట్ర స్థాయి గుర్తింపు దక్కిందని శుక్రవారం మెప్మా ఐబీ అంకయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల స్వచ్ఛాంధ్ర అధికారులు వీటిని పరిశీలించి రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదిక పంపించారు. ఈ మేరకు జరిగిన ఎంపికలలో బుచ్చి మెప్మా పేరు నమోదు చేశారని, రాష్ట్రస్థాయిలో స్థానం దక్కడం సంతోషదాయకమన్నారు. పొదుపు సంఘాల మహిళలను ప్రోత్సహించిన ఆర్పీ షబ్‌నంను అభినందించారు.

ధర్నాను జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 7న విజయవాడలో చౌక వద్ద జరిగే రాష్ట్రస్థాయి ధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు పిలుపునిచ్చారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెంలోని యూటీఎఫ్ ప్యాప్టో ప్రాంతీయ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. యాప్ల బాధనుండి విముక్తి కలిగించాలన్నారు. సమావేశంలో బీటీ సంఘం నుంచి పీవీకే ప్రసాద్, సీహెచ్ ఉమామహేశ్వరరావు, బుచ్చి, దగదర్తి, సంఘం మండలాల బాధ్యులు నాగిరెడ్డి, కేవీ.శ్రావణ్‌కుమార్, గోపి, గోపాల కృష్ణమూర్తి, జి.ఉమాశంకర్ పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి

పొదలకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం ఆర్యవైశ్య నాయకుల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలోని బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో పొదలకూరు సీఐ శివరామకృష్ణా రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు, మండల టీడీపీ అధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు, టౌన్ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జుననాయుడు, నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అమర్తలూరు చెంచయ్య, ఏఎంసీ డైరెక్టర్ పిన్నెల ప్రభాకర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుబ్బం మీరామధు, ఆకులూరు విజయ్‌కుమార్, పొట్టి సుధాకర్, మణిస్వామి, సురేష్ బాబు, సురేష్‌కుమార్, కృష్ణం రమణయ్య, డాక్టర్ బ్రహ్మయ్య ఉన్నారు. అనంతరం బిస్కెట్ ప్యాకెట్స్ పంచి పెట్టారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

వెంకటాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదగాలి పంచాయతీ పాతూరు గ్రామంలో ఉన్న మహాలక్ష్మమ్మ దేవాలయంలో గురువారం రాత్రి పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాలకు సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, యామినిరెడ్డి దంపతులిద్దరూ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈసందర్భంగా మహాలక్ష్మమ్మ దేవాలయాన్ని ఎంతో సుందరంగా అలంకరించారు. దసరా నవరాత్రి ఉత్సవాలను ఎంతో వైభవంగా జరగగా భక్తులు భారీగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు.

కేరళ వాయిద్యం.. గ్రామోత్సవ సంబరం

రాపూరు, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, నగలతో అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అశ్వవాహన రథంపై ప్రధాన వీధుల్లో ఊరేగించారు. గ్రామస్థులు అమ్మవారికి కాయ, కర్పూరం సమర్పించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కేరళ డప్పు, కళాకారుల సందడి.. వివిధ వేషధారుల నృత్యాలను ఆసక్తిగా తిలకించారు. లడ్డూ వేలం పాటలో హరికృష్ణ 40వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రెసిడెంట్ మెంటా నారాయణ శెట్టి, ఆర్యవైశ్య పెద్దలు, ఆలయ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

షట్టర్లు ఇలా...నీరు పారేదెలా?



బండేపల్లి బ్రాంచ్ కనుపూరు కెనాల్ దుస్థితి

మనుబోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండేపల్లి బ్రాంచ్ కనుపూరు కాలువ చివరి ఆయకట్టు వద్ద కాలువ దుస్థితి ఇది. పొలాలకు సాగునీటిని కాలువల ద్వారా సరైన సమయానికి అందించాలన్నా... ఎక్కువైనప్పుడు అదుపు చేయాలన్నా షట్టర్లే ప్రధానం. ఈ కాలువ కింద ఏడాదిలో ఒక పంట మాత్రమే పండిస్తారు. ఈ కాలువను నమ్ముకుని 10 గ్రామాల రైతులు వరిసాగు చేస్తారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఈ కాలువకు సాగునీరు విడతలవారీగా విడుదల చేస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ రెండు షట్టర్లూ పనిచేయడం లేదు. ఒక షట్టరు ద్వారా బండేపల్లికి, మరో షట్టర్ ద్వారా జట్లకొండూరుకు సాగునీరు పంపుతుంటారు. ఒకచోట నింపిన తరువాత మరో చోటకు నీటిని మళ్ళిస్తారు. అలా నీటిని మళ్ళించాలంటే షట్టర్లకు ఉన్న చెక్కలు కిందకు, పైకి ఆడాలి. అయితే ఇవి కొన్ని నెలలుగా పని చేయడం లేదు. పంటలు సాగు చేసే సమయం సమీపిస్తున్నందువల్ల కాలువలు, షట్టర్లు, చెక్కలకు మరమ్మతులు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఆర్వోబీ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ఆర్వోబి (రైల్వే ఓవర్ బ్రిడ్జి) లబ్ధిదారులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వేగేటు 102 వద్ద వంతెన ఏర్పాటు చేసేందుకు దక్షిణమధ్య రైల్వే శాఖ 4 ఎకరాలకు పైగా భూ సేకరణ చేసిందన్నారు. ఇందులో 13 మంది భూమిని కోల్పోగా, నష్టపరిహారంగా రూ.1.15 కోట్లు లబ్దిదారులకు అందించామన్నారు. మడమనూరులో పీఎంజీవై కింద కొత్తగా ఇళ్ళు నిర్మించుకునే లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించామన్నారు. జిల్లాలో 18 వేల 902మంది ఆటో డ్రైవర్లకు రూ. 28.35 కోట్లు ఇస్తున్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం వాహనమిత్ర కింద కేవలం 16వేల మందికి రూ.16కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం కంటె అదనంగా రూ.12కోట్లు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ ఛైర్మన్ మస్తాన్‌నాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ సాని వెంకటరమణయ్య, నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి రాయపాటి కిరణ్, నాయకులు మారంరెడ్డి రమణారెడ్డి, దండు చంద్రశేఖర్ రెడ్డి, రాజాగౌడ్, చెల్లగిరి ప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, ఉప తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీవో జలజాక్షి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు జనసేన నివాళి

వెంకటాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నేతలు సుబ్రహ్మణ్యం, చెంచయ్య, రామిరెడ్డి, విష్ణు, మదన్, అభిషేక్, వెంకటేష్, దిలీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వరప్రసాద్‌కు రూ. 50 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్నడేవిడ్ జాన్, మిత్ర బృందం

పొదలకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులను ఆదర్శంగా తీసుకుని, వారి అనుచరులు ఓ బాధితుడికి ఆర్థికసాయం అందించారు. పొదలకూరు నరసారెడ్డి కాలనీలో వెన్నెముక సమస్యతో గత ఆరేళ్లుగా మంచానికే పరిమితమైన కూచిపాటి వరప్రసాద్ కుటుంబ సభ్యులకు శుక్రవారం రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. పొదలకూరులోని వరప్రసాద్ నివాసానికి వెళ్లి నెల్లూరు హరినాదపురం ఫోర్త్ లైన్‌కి చెందిన వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేమిరెడ్డి దంపతుల అనుచరుడైన డేవిడ్ జాన్, మౌళి, రాజేష్ రెడ్డి, శ్యామ్, పవన్ అనే ఐదుగురు యువ నాయకులు రూ.50వేలు నగదును వరప్రసాద్ భార్య రేవతికి అంద జేశారు. వరప్రసాద్‌కి 90 శాతం అంగవైకల్యం కలిగిన వారికి ప్రభుత్వం అందించే రూ.15 వేలు పెన్షన్ కూడా అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీరస్తు షాపింగ్ మాల్ అధినేత గోమసాని వేణు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవ సంబరం

పొదలకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి వాసవీ మాత గ్రామోత్సవం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఉత్సవమూర్తిని అలంకరించి, ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మహిళా భక్తులు ప్రత్యేక హారతులు, టెంకాయలు కొట్టడంతో ఈ ఊరేగింపులో ఆకర్షణగా నిలిచింది. దేవస్థాన కమిటీ ఛైర్మన్ ప్రసాద్, ఆర్యవైశ్య పెద్దలు, ఆలయ కమిటీ, భక్తులు పాల్గొనడంతో గ్రామంలో జాతర వాతావరణం నెలకొంది. ఉభయకర్తలుగా చీమకుర్తి రాజగోపాల్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

కూలిన ప్రహరీగోడ.. తప్పిన ప్రమాదం



కూలిన ప్రహరీగోడ

మనుబోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ శుక్రవారం కూలిపోయింది. దీంతో గోడకు అనుబంధంగా ఉన్న గేటు ఊడిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో పిల్లలు అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రహరీగోడ నిర్మించి దాదాపు 20 ఏళ్లు కావస్తోంది. గత ప్రభుత్వంలో 'నాడు-నేడు' మరమ్మతులకు ఈ పాఠశాల నోచుకోలేదు. ప్రస్తుతం ఈ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చారు. ఇందులో 70 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలోనే అంగన్‌వాడీ కేంద్రం నడుపుతున్నారు. ప్రహరీగోడ దెబ్బతిన్న విషయాన్ని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి వెంటనే ప్రహరీగోడ, గేట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవోను ఆదేశించారు.

పూడిపర్తిలో రీ సర్వేపై అవగాహన

వెంకటాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పూడిపర్తి గ్రామంలో శుక్రవారం రీ సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ చేపట్టారు. సర్వే అధికారులు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రైతులు సర్వే జరిగే సమయంలో వారి భూముల వద్ద ఉండి సర్వేకు సహకరించాలన్నారు. సర్వే అధికారులు రామరామరాజు, సూర్యనారాయణ, సతీష్‌కుమార్, డీటీ విజయ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అష్టలక్ష్మిగా దుర్గాదేవి

మనుబోలు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రులు మనుబోలు, కోదండరామపురంలో శుక్రవారం దుర్గాదేవిని అష్టలక్ష్మిగా అలంకరించారు. అర్చకులు శాస్త్రోక్తంగా కుంకుమపూజలు నిర్వహించారు. కోదండరామపురంలో దుర్గాదేవి అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చింది.

సెంటు భూమి కూడా కబ్జాకు తావు లేదు

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ కామాక్షితాయి ఆలయ భూముల్లో సెంటు భూమి కూడా కబ్జాకు తావు లేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కామాక్షితాయి ఆలయ భూములు ఆక్రమణలకు గురయ్యాయనే ఆరోపణల నేపథ్యంలో గురువారం జొన్నవాడలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లు వైసీపీ నాయకులు కళ్ళుమూసుకుని, ఇప్పుడు ఆలయ భూమి ఆక్రమణకు గురైందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయ భూమిని కాపాడుతున్నామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చేటప్పటికే గత ప్రభుత్వంలో అమ్మవారి బ్యాంకు ఖాతా ఖాళీ కాగా, గత 15నెలల్లోనే రూ.2 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు శివకృష్ణ, సుమలత, శ్రీనివాసులు, సుధాకర్, స్థానిక సర్పంచు పెంచలయ్య, కోవూరు మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మహేంద్రతోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం రాత్రి కామాక్షితాయికి అర్చకులు సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జొన్నవాడ ఆలయంలో శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయిని దర్శించుకున్నారు. ఈఓ ఏవీ. శ్రీనివాసులు రెడ్డి, ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి ఎమ్మెల్యేని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

సాగునీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించాలి

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగునీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన అధికారులతో సమీక్షించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నందున అన్ని మేజర్, మైనర్ చెరువులను 50 శాతానికిపైగా నీటితో నింపాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్వహణ పనులకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఆర్‌ఆర్‌ఆర్ పథకం కింద ఎంపిక చేసిన పనులపై వెంటనే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, సోమశిల ఎస్ఈలు దేశ్‌నాయక్, వెంకటరమణారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ఆలయ కమిటీల్లో జిల్లా వాసులు

నెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల ట్రస్టు బోర్డులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం, శ్రీకాళహస్తి దేవస్థానాలకు 16 మందితో కూడిన పాలక వర్గాల నియామకానికి ఆమోద ముద్ర వేసింది. ఈ కమిటీల్లో జిల్లాకు చెందిన వారు చోటు దక్కించుకున్నారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యునిగా కావలికి చెందిన ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడిగా కోవూరుకు చెందిన వేమిరెడ్డి కోటారెడ్డి నియమితులయ్యారు. అలానే శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నెల్లూరు సిటీకు చెందిన కొమరి విజయమ్మను ఎంపిక చేశారు.

విధుల నుంచి క్షేత్ర సహాయకుడి తొలగింపు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడిగా పని చేస్తున్న హరికృష్ణను విధుల నుంచి తొలగిస్తూ డ్వామా పీడీ గంగాభవాని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో చెంచమ్మ శుక్రవారం తెలిపారు. నర్రవాడ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా చేరిన హరికృష్ణ తన బంధువులు, గ్రామంలో లేని వారి పేర్లతో మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారని జిల్లా అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు జూన్ నెలలో క్షేత్ర సహాయకుడిపై డ్వామా అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు నిధులు స్వాహా చేసింది వాస్తవమేనని పీడీకి నివేదిక అందించారు. దీంతో అతడిని విధుల నుంచి తొలగించడంతోపాటు స్వాహా చేసిన రూ.2.56 లక్షల నిధులను రికవరీ చేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఆదేశాలు అందినట్లు ఎంపీడీవో తెలిపారు.

రేపు జిల్లాస్థాయి యోగాసన పోటీలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా క్రీడ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన కలివెలపాళెం రెయిన్‌బో పాఠశాలలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులకు అండర్-8, 14, 18, 24, 30, 40, 50, 60 విభాగాల్లో, 60ఏళ్ల పైబడిన వారికి విడిగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 25, 26వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు అసోసియేషన్ కార్యదర్శి ఎంవీ.ప్రసన్నకుమార్‌ను సంప్రదించాలని తెలిపారు.

గాంధీ మార్గం యువతకు ఆదర్శం



నివాళులర్పిస్తున్న వీసీ శ్రీనివాసరావు, సిబ్బంది

వెంకటాచలం, అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి): మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, సామరస్యం, శాంతి వంటి విలువలు నేటి యువతకు ఎంతో అవసరమని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. వీసీ మాట్లాడుతూ యువత తప్పకుండా గాంధీ చూపిన విలువలను తమ జీవితంలో ఆచరిస్తే సమాజంలో శాంతి, అభివృద్ధి, సమానత్వం సాధ్యమవుతుందన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి జై జవాన్, జై కిసాన్ స్ఫూర్తితో దేశ సేవకు ప్రేరణ కలిగించారన్నారు. ఆయనను యువత ఆదర్శంగా తీసుకుని నాయకత్వాన్ని, సదాచారాన్ని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ జీ సుజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రౌడీషీటర్ రాముపై పీడీ యాక్ట్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వరుస నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్ గోని రాముపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం అంబేడ్కర్ కాలనీకి చెందిన గోని రాము ప్రస్తుతం ఉడ్‌హౌస్‌సంఘంలో ఉంటున్నాడు. అతనిపై రెండు హత్య, ఆరు హత్యాయత్నం, రెండు దాడి దోపిడీ, రెండు దొంగతనాలు, మూడు దాడి కేసులున్నాయి. నవాబుపేట పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఇలా వరుసగా నేరాలకు పాల్పడుతూ పలుమార్లు జైలుకు వెళ్లివచ్చాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. పలు మార్లు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా అతని తీరులో మార్పు రాకపోవడంతో పోలీసు అధికారులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ప్రస్తుతం ఆయన జిల్లా కేంద్ర కారాగారంలో ఓ కేసులో రిమాండ్‌లో ఉండగా నవాబుపేట పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

పింఛన్ నగదు ఇవ్వలేదని తండ్రిపై దాడి

నెల్లూరు రూరల్ అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు పింఛన్ నగదు ఇవ్వలేదని కుమారుడు తన తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. నెల్లూరురూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని కొండ్లపూడి పంచాయతీ రాజగోపాలపురంకు చెందిన ఇస్కకల కేశవులు(60)కు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఆ నగదు తనకు ఇవ్వాలని పెద్దకుమారుడు శివ గురువారం తండ్రిని అడిగాడు. దానికి తండ్రి ససేమీరా అనడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న శివ ఆగ్రహానికి లోనై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనను గమనించిన చిన్నకుమారుడు గాయపడిన తండ్రిని చికిత్స నిమిత్తం హుటాహుటీన నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన క్షేమంగానే ఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

కొండాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తన భార్య మరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో తీవ్ర మనోవేదనకు గురై ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి మండలంలోని సాయిపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మాల్యాద్రి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని వడ్డెపాలెంకు చెందిన బండారు సుధాకర్ (51)కు భార్య మల్లేశ్వరిపై అనుమానం ఉండేదన్నారు. గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడన్నారు. మృతుడి అన్న మాల్యాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడికి ఇంజనీరింగ్ చదివే ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా సుధాకర్ మృతిపై కాలనీ వాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బైకు ఢీకొని అంగన్‌వాడీ టీచర్ మృతి



మంజుల(ఫైల్)

కావలి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మోటారు బైకు ఢీకొనడంతో అంగన్‌వాడీ టీచర్ సమాది మంజుల (47) మృతి చెందిన సంఘటన శుక్రవారం స్థానిక పాతూరులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పాతూరు పంట కాలువ ప్రాంతంలో నివశిస్తున్న మంజుల ఇస్లాంపేట సచివాలయం సమీపంలోని అంగన్‌డీ కేంద్రంలో టీచర్‌గా పని చేస్తోంది. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి నడిచి వెళ్తుండగా ఓ వ్యక్తి మోటారు బైకుపై అతివేగంగా వచ్చి ఆమెను ఢీ కొట్టి వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ మంజులను స్థానికులు ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన మోటారు బైకును స్థానికులు గుర్తించారు. మృతురాలి కుమార్తె మనోజ్ఞ ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ జమాల్ వలీ తెలిపారు.

రెండు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండల పరిధిలో రెండు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగాయి. వివరాల మేరకు.. కొత్తూరు కరెంట్ ఆఫీస్‌లోని స్పెషల్ పవర్ మెయింటేషన్స్(ఎస్‌పీఎం) విభాగంలో శుక్రవారం సాయంత్రం మినీ లారీలో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాదం జరిగింది. కార్యాలయ సిబ్బంది అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఏడీఎఫ్‌వో పీ.శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ.3 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

- **పెద్దచెరుకూరులో...**

నెల్లూరు రూరల్ మండలం పెద్దచెరుకూరులోని జీఎల్ పూజిత ఆర్గో ఇండస్ట్రీస్ బాయిలర్ వద్ద పొట్టుకు నిప్పంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో పొట్టు దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు ఏడీఎఫ్‌వో శ్రీనాథ్ రెడ్డి, ఎల్ఎఫ్‌వో శివసాయికుమార్, మస్తాన్, తదితరులు మంటలను అదుపు చేశారు.

డీజేకి అనుమతి ఇవ్వకుంటే మిద్దె పైనుంచి దూకేస్తా!

కావలి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ ఉత్సవాల్లో డీజేకి పోలీసులు అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నారని, వెంటనే అనుమతి ఇవ్వకుంటే మిద్దెపై నుండి దూకేస్తానని అమ్మవారి మాల ధారణలో ఉన్న ఓ భక్తుడు హల్‌చల్ చేసిన సంఘటన విజయదశమి సందర్భంగా స్థానిక వైకుంఠపురంలో జరిగింది. బాధితుడు గుంజి ప్రసన్న తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వైకుంఠపురంలోని గాంధీవీధిలో ఏర్పాటు చేసిన చల్లి దుర్గాదేవి అమ్మవారి దసరా వేడుకల్లో డీజే అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా పోలీసులు అనుమతి ఇవ్వలేదన్నారు. గస్తీకి వచ్చి పోలీసులు డీజేని అడ్డుకున్నారన్నారు. దీంతో మాలధారణలో ఉన్న ప్రసన్న డీజే పాటలకు అనుమతి ఇవ్వకుంటే మిద్దెపై నుండి దూకేస్తానని చెప్పాడు. విషయం తెలుసుకున్న రెండవ పట్టణ సీఐ గిరిబాబు, రూరల్ ఎస్ఐ బాజీబాబు సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి గొడవలకు తావు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

డైమాండ్ డబ్బా నిర్వహించినందుకు ఐదుగురిపై కేసు నమోదు

వెంకటాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనికేపల్లిలో దసరా ఉత్సవాల సందర్భంగా డైమాండ్ డబ్బా నిర్వహించిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనికేపల్లిలో డైమాండ్ డబ్బా నిర్వహించినట్లు సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేయడంతో నిర్వాహకులను పోలీసులు గుర్తించారు. అనికేపల్లి గ్రామానికి చెందిన పుట్టా ప్రభాకర్, పర్వతాల శివప్రసాద్, యనమల ప్రభాకర్, నాసిన శ్రీనివాసులు, టీపీ గూడూరు మండలం ముంగలదరువు గ్రామానికి చెందిన ఇనానగరాజ కృష్ణయ్యలు ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా డైమాండ్ డబ్బాను నిర్వహించారని వీరిపై వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు.

జీఎస్టీ 2.0పై రైతులకు అవగాహన

ఉదయగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం, ఉదయగిరి-1 రైతుసేవా కేంద్రాల పరిధిలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ జీఎస్టీ 2.0పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పోషకాలు, ట్రాక్టర్ మరియు పనిముట్ల మీద 7 శాతం జీఎస్టీ తగ్గిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11173
వెండి కిలో ధర	రూ. 149400
వెండి ఒక గ్రాము	రూ. 153.40

న్యూస్ బాక్స్

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రెహనాబేగం

ఉదయగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నరుకూరు గ్రామంలో ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రెహనాబేగం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహించిన సీఐటీయూ మూడవ మండల మహాసభలో ఆమె మాట్లాడుతూ కార్మికులకు 8గంటల సమయం పని కొనసాగించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు రాత్రి డ్యూటీలను రద్దు చేయాలన్నారు. అనంతరం 15 మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ విజయమ్మ, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, కోడె రమణయ్య, కామాక్షమ్మ, విజయ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో వ్యాధుల దూరం

ఆత్మకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకల సందర్భంగా గురువారం ఆత్మకూరు పట్టణంలోని షిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో సజ్జన సాంగత్యం, క్రియా యోగ సాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్ శ్రీవాణి మాటాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమని తెలిపారు. ధ్యానంతో వ్యాధులు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ చంద్రా విజయలక్ష్మీ, పలువురు ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

మంచినీరు సక్రమంగా విడుదల చేయాలి

కలువాయి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తాగునీరు సక్రమంగా పంపిణీ చేయాలని మండల కేంద్రమైన కలువాయిలోని మహిళలు కోరుతున్నారు. సారవ వద్దనున్న నీటి పథకం నుంచి తాగునీరు వేళాపాళా లేకుండా విడుదల చేయడంతో పాటు కొద్దిసేపు కూడా నీరు విడుదల చేయడం లేదని పలువురు మహిళలు శుక్రవారం పంచాయతీ కార్యాయలంలో ఫిర్యాదు చేశారు. అధికారులు తగు చర్యలు తీసుకుని తాగునీటిని సక్రమంగా విడుదల చేయాలని వారు కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఉదయగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కావలి మార్గంలో మంగళగిరి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ పీ సామ్రాజ్యం, ఉప సర్పంచ్ ముర్తుజాల సహకారంతో పరిష్కరించినట్లు డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌కవేటర్‌తో పైపలైన్‌లు తవ్వి వాటి స్థానంలో నూతన పైపలైన్ ఏర్పాటుచేయించి ఎలాంటి ఆటంకం లేకుండా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

గుండెపోటుతో అర్చకుడి మృతి

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంలో పూజలు చేస్తూ గుండెపోటుతో అర్చకుడు మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెంగమాంబ ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న ఇర్లపాటి సురేష్ (46) దసరా పర్వదినం సందర్భంగా ఆలయంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు పూజలు చేపట్టి తీర్థప్రసాదాలు అందజేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో సిబ్బంది 108 వాహనానికి సమాచారం అందించి అది వచ్చేలోపు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తుండగా 108 వాహనం వారు సైతం పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే వింజమూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఆటో ర్యాలీని విజయవంతం చేయాలి

సంగం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం ఆటో డ్రైవర్ల భరోసా పథకం అమలులో భాగంగా శనివారం ఆత్మకూరులో నిర్వహించే ఆటో ర్యాలీని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు రూ. 15వేలు శనివారం విడుదల చేయనున్నారని ఆయన తెలిపారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



ఉదయగిరి: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో పార్వతీదేవి అమ్మవారు



వరికుంటపాడులో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో నాగరప్పమ్మదేవి



తూర్పురొంపిదొడ్లలో మనసాదేవి అలంకరణలో అమ్మవారు

ఆత్మకూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు అమ్మవారి ఆలయాల్లో దసరా వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆత్మకూరు పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘనాథస్వామి ఆలయంలో స్వామివారికి శ్రవణా నక్షత్ర కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సత్రంసెంటర్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కన్యకాపరమేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. జ్వాలాముఖీ ఆలయంలో జగన్మాత రాజరాజేశ్వరిదేవి అలంకరణలో శోభిల్లారు. కాశీనాయన ఆశ్రమంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● **సంగం:** స్థానిక సంగమేశ్వరాలయంలో కామాదేవి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీసేవ నిర్వహించారు. రాళ్లచెలిక, కొత్తూరులో ఉన్న బాలచౌడేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. గంగమ్మ ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమనకొండలో రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో లలితా రుద్ర మహాయజ్ఞం



ఆత్మకూరు : శ్రీదేవి, భూదేవి సమేత అలఘనాథస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వడ్డిపాళెంలోని రౌద్ర అంకమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు పెన్నానదికి వెళ్లి కలశ జలాలు తీసుకువచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ

స్థానిక పోలీస్‌స్టేసన్, సర్కిల్ కార్యాలయంలో విజయదశమిని పురస్కరించుకుని గురువారం ఆయుధ పూజ నిర్వహించారు. అదేవిధంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ మన్మధరావు ట్రాన్స్‌ఫార్మర్‌లకు పూజలు నిర్వహించారు.

అలాగే వాహనదారులు ఆలయాల వద్ద వాహనాలకు పూజలు చేయించారు.

● **ఉదయగిరి:** పట్టణంలోని పార్వతీపరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మీదేవి, మండలంలోని గండిపాళెం గ్రామంలో నాగారప్పమ్మ, గంగమ్మ ఆలయాల్లో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆయుధ పూజ నిర్వహించారు. స్టేషన్‌లో ఉన్న ఆయుధాలు, వాహనాలను శుభ్రంచేసి ప్రత్యేక పూజలు చేపట్టారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలో తూర్పురొంపిదొడ్లలో ఉన్న అమ్మవారు మానసాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వరికుంటపాడులోని నాగరప్పమ్మ అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ, అభిషేకాలు, నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.



కొత్తూరులో బాలచౌడేశ్వరిదేవి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



ఉదయగిరిలో ఆయుధ పూజలో ఎస్ఐ, సిబ్బంది

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం

వింజమూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) కార్యాలయంలో గురువారం ఉదయం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు మాట్లాడుతూ అన్ని రంగాలలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యున్నత స్థానంలో నిలిపేందుకు సంఘ స్వయం సేవకులందరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవి.రామిరెడ్డి, కోదండరామిరెడ్డి, నగర సంఘచాలక్ దండే మధు, వైసీపీ నాయకులు జడ్పీటీసీ మెంబరు గణపం బాలకృష్ణారెడ్డి, మండల టీడీపీ నాయకుడు గువ్వల కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు యల్లాల రఘురామిరెడ్డి, పులిచెర్ల నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మద్దూరు రాజగోపాల్ రెడ్డి, ఆపస్ రాష్ట్ర కార్యదర్శి పలుకూరి వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అనంతసాగరం అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిఆత్మకూరు వ్యవసాయ సొసైటీ సహకార బ్యాంకు మేనేజర్ రామ్మోహన్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లికార్జున సూచించారు. శుక్రవారం అనంతసాగరంలో ఖాతాదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. గృహ, వాహన, రైతులకు ప్రత్యేక రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో బాబు, సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాహూరు సుబ్బారెడ్డి, ఖాసీంబాష తదితరులు పాల్గొన్నారు.

సర్వే బృందానికి రైతులు సహకరించాలి

ఉదయగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం రెవెన్యూ గ్రామంలో శనివారం నుంచి చేపట్టనున్న భూ రీసర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహసీల్దారు ఎల్ రామ్మోహన్ సూచించారు. శుక్రవారం గ్రామంలో రీసర్వేపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సర్వే సమయంలో భూమికి సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచుకుని హద్దులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాయబ్‌రసూల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో తప్పిదాలను సరిచేయాలని రైతుల ఆందోళన



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

ఉదయగిరి, అక్టోబరు 3 ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో చేపట్టిన భూ రీసర్వేలో చోటు చేసుకున్న తప్పిదాలను సరిచేయాలని శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో బిజ్జంపల్లి గ్రామంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ రీసర్వేలో రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పిదాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూముల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పుగా వస్తుండడంతో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దక్కకపోవడంతోపాటు బ్యాంకు రుణాలు కూడా పొందలేకున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూరీసర్వేలో తప్పిదాలను సరిచేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

గంగ కాలువపై అనుమానాస్పదంగా బైక్



గంగ కాలవ గట్టుపె ఉన్న బైక్

కలువాయి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలం పర్లకొండ సమీపంలోని సోమశిల కండలేరు (తెలుగుగంగ) కాలువ గట్టుపై గురువారం సాయంత్రం నుంచి ఒక మోటారు సైకిల్ అనుమానాస్పదంగా నిలిపి ఉంది. మోటారు సైకిల్ పక్కన చెప్పులు వదిలి ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు బైక్ అక్కడే ఉండటం.. ఎవ్వరూ అక్కడ లేకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి మోటారుసైకిల్‌ను స్టేషనుకు తీసుకుపోయారు. కాగా, ఈ మోటారుసైకిల్ చింతలాత్మకూరు గ్రామానికి చెందిన నాగిళ్ల రవికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. గురువారం సాయంత్రం నుంచి రవి ఇంటి వద్ద కూడా లేడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. ఐస్‌క్రీమ్ బండికి కూలికి వెళ్తుంటాడని, మతిస్థిమితం కూడా సరిగా ఉండదని కుటుంబ సభ్యలు తెలిపినట్లు ఎస్ఐ చెప్పారు. కాలువ గట్టున మోటారు సైకిల్ ఉండటంతో రవి కాలువలో గల్లంతై ఉండవచ్చన్న అనుమనాలు కూడా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గాంధీ జయంతి



ఉదయగిరి: తహసీల్దారు కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న డీటీ, ఉద్యోగులు

ఉదయగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను గురువారం ఉదయగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు షాజియా, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, పోలీసు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● **వరికుంటపాడు(ఉదయగిరి రూరల్):** స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘునాథ్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● **సీతారామపురం:** మహాత్మాగాంధీ చూపిన శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని బిట్ -1 సచివాలయంలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ హసానయ్య, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, తెలుగు యువనాయకుడు వికాష్‌బాబు, మండల ముస్లీం నాయకులు షేక్ బాబు, దేవర వెంకటేశ్వర్లు, తోట ఏడుకొండలు, వెంకటరమణ, లీలకృష్ణ పాల్గొన్నారు.

● **వింజమూరు:** పట్టణంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నల్లగొండ సృజన, పంచాయతీ కార్యదర్శి రామారావు తదితరులు గాంధీ పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది, తదితులు పాల్గొన్నారు.



వరికుంటపాడు పోలీసుస్టేషన్‌లో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎస్ఐ రఘునాథ్, సిబ్బంది

C.R.I.M.E N.E.W.S

రౌడీషీటర్ రాముపై పీడీ యాక్ట్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వరుస నేరాలకు పాల్పడుతున్న రౌడీషీటర్ గోని రాముపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం అంబేడ్కర్ కాలనీకి చెందిన గోని రాము ప్రస్తుతం ఉడ్‌హౌసనంఘంలో ఉంటున్నాడు. అతనిపై రెండు హత్య, ఆరు హత్యాయత్నం, రెండు దాడి దోపిడీ, రెండు దొంగతనాలు, మూడు దాడి కేసులున్నాయి. నవాబుపేట పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఇలా వరుసగా నేరాలకు పాల్పడుతూ పలుమార్లు జైలుకు వెళ్లివచ్చాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. పలుమార్లు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా అతని తీరులో మార్పు రాకపోవడంతో పోలీసు అధికారులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ప్రస్తుతం ఆయన జిల్లా కేంద్ర కారాగారంలో ఓ కేసులో రిమాండ్‌లో ఉండగా నవాబుపేట పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

పింఛన్ నగదు ఇవ్వలేదని తండ్రిపై దాడి

నెల్లూరు రూరల్ అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు పింఛన్ నగదు ఇవ్వలేదని కుమారుడు తన తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. నెల్లూరురూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని కొండ్లపూడి పంచాయతీ రాజగోపాలపురంకు చెందిన ఇస్కకల కేశవులు(60)కు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఆ నగదు తనకు ఇవ్వాలని పెద్దకుమారుడు శివ గురువారం తండ్రిని అడిగాడు. దానికి తండ్రి ససేమీరా అనడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న శివ ఆగ్రహానికి లోనై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనను గమనించిన చిన్నకుమారుడు గాయపడిన తండ్రిని చికిత్స నిమిత్తం హుటాహుటీన నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన క్షేమంగానే ఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

కొండాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తన భార్య మరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో తీవ్ర మనోవేదనకు గురై ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి మండలంలోని సాయిపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మాల్యాద్రి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని వడ్డెపాలెంకు చెందిన బండారు సుధాకర్ (51)కు భార్య మల్లేశ్వరిపై అనుమానం ఉండేదన్నారు. గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడన్నారు. మృతుడి అన్న మాల్యాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడికి ఇంజనీరింగ్ చదివే ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా సుధాకర్ మృతిపై కాలనీ వాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బైకు ఢీకొని అంగన్‌వాడీ టీచర్ మృతి



మంజుల(ఫైల్)

కావలి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మోటారు బైకు ఢీకొనడంతో అంగన్‌వాడీ టీచర్ సమాది మంజుల (47) మృతి చెందిన సంఘటన శుక్రవారం స్థానిక పాతూరులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పాతూరు పంట కాలువ ప్రాంతంలో నివశిస్తున్న మంజుల ఇస్లాంపేట సచివాలయం సమీపంలోని అంగన్‌డీ కేంద్రంలో టీచర్‌గా పని చేస్తోంది. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి నడిచి వెళ్తుండగా ఓ వ్యక్తి మోటారు బైకుపై అతివేగంగా వచ్చి ఆమెను ఢీ కొట్టి వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ మంజులను స్థానికులు ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన మోటారు బైకును స్థానికులు గుర్తించారు. మృతురాలి కుమార్తె మనోజ్ఞ ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ జమాల్ వలీ తెలిపారు.

రెండు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ మండల పరిధిలో రెండు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగాయి. వివరాల మేరకు.. కొత్తూరు కరెంట్ ఆఫీస్‌లోని స్పెషల్ పవర్ మెయింటేషన్స్(ఎస్‌పీఎం) విభాగంలో శుక్రవారం సాయంత్రం మినీ లారీలో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాదం జరిగింది. కార్యాలయ సిబ్బది అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఏడీఎఫ్‌వో వీ.శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో రూ.3 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

● **పెద్దచెరుకూరులో...**

నెల్లూరు రూరల్ మండలం పెద్దచెరుకూరులోని జీఎల్ పూజిత ఆర్గో ఇండ్రస్ట్రీస్ బాయిలర్ వద్ద పొట్టుకు నిప్పంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో పొట్టు దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు ఏడీఎఫ్‌వో శ్రీనాథ్ రెడ్డి, ఎల్ఎఫ్‌వో శివసాయికుమార్, మస్తాన్, తదితరులు మంటలను అదుపు చేశారు.

డీజేకి అనుమతి ఇవ్వకుంటే మిద్దె పైనుంచి దూకేస్తా!

కావలి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ ఉత్సవాల్లో డీజేకి పోలీసులు అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నారని, వెంటనే అనుమతి ఇవ్వకుంటే మిద్దెపై నుండి దూకేస్తానని అమ్మవారి మాల ధారణలో ఉన్న ఓ భక్తుడు హల్‌చల్ చేసిన సంఘటన విజయదశమి సందర్భంగా స్థానిక వైకుంఠపురంలో జరిగింది. బాధితుడు గుంజి ప్రసన్న తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వైకుంఠపురంలోని గాంధీవీధిలో ఏర్పాటు చేసిన చల్లి దుర్గాదేవి అమ్మవారి దసరా వేడుకల్లో డీజే అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా పోలీసులు అనుమతి ఇవ్వలేదన్నారు. గస్తీకి వచ్చి పోలీసులు డీజేని అడ్డుకున్నారన్నారు. దీంతో మాలధారణలో ఉన్న ప్రసన్న డీజే పాటలకు అనుమతి ఇవ్వకుంటే మిద్దెపై నుండి దూకేస్తానని చెప్పాడు. విషయం తెలుసుకున్న రెండవ పట్టణ సీఐ గిరిబాబు, రూరల్ ఎస్ఐ బాజీబాబు సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి గొడవలకు తావు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

డైమాండ్ డబ్బా నిర్వహించినందుకు ఐదుగురిపై కేసు నమోదు

వెంకటాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనికేపల్లిలో దసరా ఉత్సవాల సందర్భంగా డైమాండ్ డబ్బా నిర్వహించిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనికేపల్లిలో డైమాండ్ డబ్బా నిర్వహించినట్లు సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేయడంతో నిర్వాహకులను పోలీసులు గుర్తించారు. అనికేపల్లి గ్రామానికి చెందిన పుట్టా ప్రభాకర్, పర్వతాల శివప్రసాద్, యనమల ప్రభాకర్, నాసిన శ్రీనివాసులు, టీపీ గూడూరు మండలం ముంగల దరువు గ్రామానికి చెందిన ఇనానగరాజ కృష్ణయ్యలు ప్రజా శాంతికి భంగం కలించే విధంగా డైమాండ్ డబ్బాను నిర్వహించారని వీరిపై వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 525

విధుల నుంచి క్షేత్ర సహాయకుడి తొలగింపు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ పంచాయతీలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడిగా పని చేస్తున్న హరికృష్ణను విధుల నుంచి తొలగిస్తూ డ్వామా పీడీ గంగాభవాని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో చెంచమ్మ శుక్రవారం తెలిపారు. నర్రవాడ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుడిగా చేరిన హరికృష్ణ తన బంధువులు, గ్రామంలో లేని వారి పేర్లతో మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారని జిల్లా అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు జూన్ నెలలో క్షేత్ర సహాయకుడిపై డ్వామా అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు నిధులు స్వాహా చేసింది వాస్తవమేనని పీడీకి నివేదిక అందించారు. దీంతో అతడిని విధుల నుంచి తొలగించడంతోపాటు స్వాహా చేసిన రూ.2.56 లక్షల నిధులను రికవరీ చేయడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఆదేశాలు అందినట్లు ఎంపీడీవో తెలిపారు.

న్యూస్ బాక్స్



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

మహాత్మాగాంధీకి ఘన నివాళి

లింగసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని లింగసముద్రంలోని ఆయన విగ్రహానికి పలువురు టీడీపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక తిరుమణిశెట్టి కోటయ్య మందిరం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, టీడీపీ నేతలు అడపా రంగయ్య, అడపా కోటయ్య, భట్టరుశెట్టి రమణయ్య, జి బాలనారాయణ, కిలారి యశ్వంత్, షేక్ పరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీరోడ్డులో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున విద్యుత్ లైన్లు మార్పుకోసం శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎమ్మార్వో ఆఫీసు ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈఈ టీవీ నరసింహం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని సుల్తాన్‌మొహిద్దీన్ హాస్పటల్ ఏరియా, సంతోష్‌నగర్, మక్కా మసీదు ఏరియా, ఎమ్మార్వో ఆఫీసు ఏరియా, బూడిదపాలెం, పాత బ్యాంకు బజారు, కోటకట్ట వీధి, అన్నా క్యాంటీన్, పెద్దబజారు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కావలిలో...

కావలి,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉత్తర శివార్లలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఒకటో పట్టణ విద్యుత్ శాఖ ఏఈ నాగార్జున శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాతూరు, గాయత్రీనగర్, వేపకాయల మిల్లు తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

'ఉపాధి' పనులు గుర్తించాలి

ఉలవపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాబోవు ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామంలోని ఉపాధి పనులను గుర్తించాలని ఏపీవో అబ్దుల్లా కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచు నాగలక్ష్మీ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 68,000 పనిదినాలు కల్పించేలా చెరువులు, గుంతలు, పంట కాలువలు గుర్తించాలని ఏపీవో సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు కల్పించే విధంగా పనులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరయ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రారంభం

జలదంకి, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం చోడవరంలో భూముల రీసర్వే శుక్రవారం ప్రారంభమైంది. గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయంలో తహసీల్దారు ప్రమీల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మొత్తం 3700 ఎకరాలు రీసర్వే చేయనున్నామని, 60 రోజుల వ్యవధిలో మొత్తం సర్వే చేసి హద్దులు గుర్తిస్తామని తహసీల్దారు తెలిపారు. భూహక్కుదారులు తమ పత్రాలు సర్వే బృందానికి ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయరు శోభన్, గ్రామస్తులు జాజుల శివరామయ్య, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శింగపేటలో...



మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

అల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరు మండలం శింగపేటలో భూరీసర్వే కార్యక్రమం నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ శుక్రవారం శింగపేటలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ 60 రోజులపాటు శింగపేటలో భూ రీసర్వే కొనసాగుతుందన్నారు. రైతులు అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ నరసింహమూర్తి, డీటీ ప్రవీణ్‌కుమార్, సర్వేయరు అశోక్, ఆర్ఐ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయ జీర్ణోద్ధరణకు 6వతేదీ భూమి పూజ

కలిగిరి, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంపై శుక్రవారం గ్రామపెద్దలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోమవారం ఆలయ నిర్మాణానికి సంబంధించి భూమిపూజ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టి, త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయటానికి అందరూ సహకరించాలని కోరారు.

ఘనంగా దసరా సంబరాలు

కందుకూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని గురువారం కందుకూరు పట్టణ, పరిసర ప్రాంతాలలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకమ్మ దేవాలయం, కోవూరు రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని జనార్ధనస్వామి ఆలయం, కోదండ రామాలయం, సోమేశ్వరాలయాల్లో ప్రజలు పెద్దసంఖ్యలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. గురువారం రాత్రి అంకమ్మ ఆలయ ప్రాంగణంలో పార్వేట మహోత్సవం కన్నులపండుగగా జరిగింది. గ్రామంలోని వివిధ ఆలయాల ఉత్సవమూర్తులు గ్రామోత్సవంగా అంకమ్మ దేవాలయానికి చేరుకుని కొలువుదీరగా భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పార్వేట ఉత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

● ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

లింగసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినపవని గ్రామంలోని పావన క్షేత్రం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా మహాసుదర్శన హోమం, స్వామి వారికి చక్రస్నానం, నిత్యహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి దేవతామూర్తులకు పూజలు చేశారు. సాయంత్రం స్వామి వార్లకు గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా విజయదశమి

కొండాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగను గురువారం మండలపరిధిలోని పలు గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. సాయిపేట పంచాయతీలోని మక్కెనవారిపాలెం గంగమ్మ గుడివద్ద భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపాలెం గ్రామంలో మహాలక్ష్మమ్మ గుడివద్ద ప్రత్యేకపూజలతో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గౌరీదేవి అలంకారంలో దుర్గాభ్రమరాంబ అమ్మవారు



కందుకూరు : పార్వేట ఉత్సవంలో ఎమ్మెల్యే ఇంటూరి, భక్తులు

● సముద్రతీరంలో అమ్మవార్ల నిమజ్జనం

కావలి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ గ్రామాన ఉన్న అమ్మవారి ఆలయాల్లో విజయదశమి సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి శుక్రవారం అమ్మవార్లను సముద్ర తీరానికి తరలించి నిమజ్జనం చేశారు. అమ్మవారి మాలధారణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద చిన్నారుల చే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వైకుంఠపురం గాంధీ వీధిలో చల్లా దుర్గాదేవి అమ్మవారిని ప్రత్యేక పూజల అనంతరం తుమ్మలపెంట తీరంలో నిమజ్జనం చేశారు. గుంజి ప్రసన్నకుమార్, కిరణ్, రాంబాబు, ఈగలపాటి సుభాషిణి, విజయమ్మ, పద్మ, శివ పాల్గొన్నారు.

అల్లూరు: అల్లూరు మండలంలో విజయదశమి ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. నార్తుమోపూరు పర్వతవర్ధినిదేవి ఆలయంలో అమ్మవారు ఉమామహేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరులోని పార్వతిదేవి ఆలయంలో నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిట్రగుంట: బోగోలు మండలంలో శరన్నవ రాత్రుల చివరిరోజు గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ఆలయాల్లో రాజరాజేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథరావుపేట కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బోగోలు షిరిడి సాయిబాబా మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వస్వామి, జువ్వలదిన్నె శివాలయం, నాగులవరం గంగాపార్వతి సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



కావలి రూరల్ : అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



లింగసముద్రం : చినపవనిలో గ్రామోత్సవంలో గరుడ వాహనం మీద ఉభయదేవేరులతో ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

కావలి (టౌన్): అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామ దేవత కలుగోళశాంభవీ అమ్మవారు కలుగోళశాంభవీ అలంకారంలో దర్శనమివ్వగా, రాత్రి గజవాహన సేవలందుకున్నారు. శివాలయంలో దుర్గాభ్రమరాంబ అమ్మవారు గౌరీదేవి అలంకారంలో దర్శనమివ్వగా సాయంత్రం శాంతి కల్యాణం జరిగింది. విష్ణు ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ట్రంకురోడ్డు బృందావనం కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి.

అర్హత ఉన్న ప్రతీ ఆటో డ్రైవరుకు ప్రభుత్వ సాయం

కావలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతీ ఆటోడ్రైవరుకు ప్రభుత్వం అందించే రూ. 15 వేల సాయం అందేలా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులతో ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో 1888 మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున శనివారం రూ. 2.83 కోట్లు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంకు సంఘీభావం తెలుపుతూ ఆటో డ్రైవర్లు ముసునూరులోని ఎమ్మెల్యే నివాసం నుంచి మద్దూరుపాడులోని ఎస్ఎంకే కన్వెన్షన్ హాలు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్ల సమస్యలపై చర్చించి అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సాయం అందేలా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆటో డ్రైవర్లతో మాట్లాడతారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ టీడీపీ నేతలు గుత్తికొండ కిశోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, మాలేపాటి నాగేశ్వరరావు, శాంతకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి

నూతన టీడీపీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

అల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరు మండల నూతన టీడీపీ కార్యాలయ భవన భవనానికి శుక్రవారం భూమిపూజ, శంకుస్థాపన చేశారు. సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీదగిరిధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అల్లూరుపేట ప్రాంతంలో టీడీపీ నూతన కార్యాలయ నిర్మాణానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, బండి అమర్‌రెడ్డి, మేడా క్రిష్ణారెడ్డి, సామంతుల కిరణ్‌రెడ్డి, నీలపురెడ్డి హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయ భూపూజలో బీద గిరిధర్

రాష్ట్రంలోని ప్రధాన ఆలయ కమిటీల్లో జిల్లా వాసులు

నెల్లూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల ట్రస్టు బోర్డులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం, శ్రీకాళహస్తి దేవస్థానాలకు 16 మందితో కూడిన పాలక వర్గాల నియామకానికి ఆమోద ముద్ర వేసింది. ఈ కమిటీల్లో జిల్లాకు చెందిన వారు చోటు దక్కించుకున్నారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యునిగా కావలికి చెందిన ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితుడిగా కోవూరుకు చెందిన వేమిరెడ్డి కోటారెడ్డి నియమితులయ్యారు. అలానే శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నెల్లూరు సిటీకు చెందిన కొమరి విజయమ్మను ఎంపిక చేశారు.

రేపు జిల్లాస్థాయి యోగాసన పోటీలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా క్రీడ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన కలివెలపాళెం రెయిన్‌బో పాఠశాలలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషులకు అండర్-8, 14, 18, 24, 30, 40, 50, 60 విభాగాల్లో, 60ఏళ్ల పైబడిన వారికి విడిగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 25, 26వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు అసోసియేషన్ కార్యదర్శి ఎంవీ.ప్రసన్నకుమార్‌ను సంప్రదించాలని తెలిపారు.

అధ్వానంగా డ్రైనేజీ..

రోడ్డుపైనే మురుగునీరు!

కావలి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు పోలేరమ్మ అరుగు నుంచి కృష్ణుడి బొమ్మ సెంటర్ వరకు డ్రైనేజీ అధ్వానంగా మారింది. దీంతో మురుగునీరు రోడ్డుపైనే మడుగును తలపిస్తోంది. పాతూరులో అత్యంత రద్దీగా ఉండే ఆ రోడ్డులో డ్రైనేజీ దెబ్బతినడంతో తరచూ మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. చెత్తా చెదారం అడ్డుపడంతో వారం రోజులుగా రోడ్డుపైనే మురుగు నీరు నిలిచిపోయింది. ఎన్నిసార్లు చెప్పినా మున్సిపల్ అధికారులు పట్టించుకోడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడ మురుగునీరు రోడ్డుపై ఉన్నందున పోలేరమ్మఅరుగు, క్రిష్ణమందిరానికి వెళ్లే భక్తులు, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలువకు అడ్డుగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పోలేరమ్మ అరుగు వీధిలో రోడ్డుపై నిలిచిన మురుగు

జీఎస్టీ 2.0తో అన్నివర్గాల ప్రజలకు మేలు

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, ప్రతి కుటుంబానికి రూ. 15వేలు వరకు ఆదా అవుతుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో భాగంగా పట్టణంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంకమ్మ దేవాలయం వద్ద నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాలుగు శ్లాబ్‌లుగా ఉన్న జీఎస్టీని ప్రస్తుతం రెండు శ్లాబ్‌లుగా మార్చారని, దీంతో 83 రకాల వస్తువుల ధరలు తగ్గాయని దీంతో అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, జనిగర్ల నాగరాజు, పూరిమెట్ల గురునాథం, రాచగర్ల సుబ్బారావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పోకూరి రాంబాబు, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదరావు, జనసేన నాయకులు గోకరాజు మదన్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన

ఉలవపాడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ నూతన సంస్కరణలపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం రైతుసేవా కేంద్రం-3 వద్ద వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్ జీఎస్టీ స్లాబ్, జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌ను వివరించారు. వ్యవసాయ ట్రాక్టర్, పనిముట్లు తదితరాలపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతంకు తగ్గించారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు, కూటమి పార్టీల శ్రేణులు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

కందుకూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన గురువారం 167బీ జాతీయ రహదారిపై ఓగూరు సమీపంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఉపాధ్యాయుడు అశోక్‌బాబు స్వగ్రామం పలుకూరు కాగా, కావలిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా గుడ్లూరు మండలం పరకొండపాడుకు చెందిన వారు విజయవాడలో వివాహం చేసుకుని కారులో స్వ గ్రామానికి వస్తుండగా మోటారుసై కిల్‌ను కారు ఢీ కొంది. దీంతో అశోక్‌బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. కారు కూడా అదుపుతప్పి పక్కన ఉన్న పొలాల్లోకి వెళ్లి ఆగింది. అయితే కారులో బెలూన్లు ఓపెన్ కావటంతో కారులోని వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. మృతుడు అశోక్‌బాబుకు భార్య, కుమారుడు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



అదుపుతప్పి పొలాల్లోకి వెళ్లిన కారు



అశోక్‌బాబు (ఫైల్)

సీపీఐ నేతల సంతాపం

ఉపాధ్యాయుడు అశోక్‌బాబు మృతిపట్ల సీపీఐ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు. సీపీఐ జాతీయ నాయకుడు రావుల వెంకయ్య, జిల్లా నాయకులు దామా అంకయ్య, నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్‌బాబు, వై ఆనంద్‌మోహన్ తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

నేటి నుంచి కోదండరామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు



పునః ప్రతిష్ఠ ఉత్సవాలకు ముస్తాబవుతున్న కోదండరామస్వామి ఆలయం

కావలి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం చౌదరిపాలెంలో శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండరామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ పూజలు శనివారం నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీన సాయంత్రం పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మేధినీపూజ, అంకురార్పణ, 5వ తేదీ ఉదయం యాగశాల ప్రవేశం, కుంభస్థాపన, శ్రీరామ మూలమంత్రం, మంగళస్నానం, మంగళహారతి, సాయంత్రం పంచసూక్త హోమం, లఘుపూర్ణాహుతి, సామూహిక లక్షతులసి దళార్చన తదితర పూజలు జరుగుతాయన్నారు. 6వ తేదీన ఉదయం శ్రీరామ మూలమంత్ర హోమం, కుంభారాధన, కుంభ ఉద్వాసన, సంప్రోక్షణ కుంభాభిషేకాల అనంతరం 11.30కి సీతారాముల కళ్యాణం, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటి సభ్యులు కోరారు.

ప్రశాంతం దిగ్విజయం

● ముగిసిన బ్రహ్మోత్సవాలు

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగియడంతో టీటీడీ పాలకమండలి, అధికార యంత్రాంగం ఆనందంగా ఉన్నాయి. విజయవంతం చేశారంటూ ఏకంగా సీఎం చంద్రబాబు ట్వీట్ చేయడం విశేషం. ఈ విజయం వెనుక మూడు నెలల ముందస్తు కృషి ఉంది. బ్రహ్మోత్సవాల ముందు బదిలీ అయిన ఈవో శ్యామలరావు, తండ్రి కన్నుమూయడంతో హాజరుకాలేకపోయిన అదనపు ఈవో వెంకయ్యచౌదరిల పాత్ర చాలా ఉంది. ప్రస్తు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ కు అయిదు బ్రహ్మోత్సవాలను నిర్వహించిన అనుభం ఉండడం, ముఖ్య అధికారులందరికీ గత బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగం అయిన అనుభవం ఉండడం ఈసారి చిన్న అవాంతరం కూడా లేకుండా విజయవంతం కావడానికి కారణమయ్యాయి. ముఖ్యంగా ఈసారి రాజకీయ హడావుడి లేకపోవడం ప్రత్యేకం. ఆ శ్రీనివాసుడే వెనుక ఉండి నడిపించాడని అందరూ ఆనందంగా ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



◆ తోపులాటల్లేని గరుడోత్సవం

బ్రహ్మోత్సవాల్లో పాలకమండలీ, అధికారులూ అత్యంత టెన్షన్‌గా ఉండేది గరుడోత్సవం రోజు. లక్షల మంది జనం ముందే కొండమీదకు చేరుకుంటారు. వీరిలో స్థానికుల సంఖ్య గణనీయంగా ఉంటుంది. వీరికి నీరు, ఆహారం, మరుగుదొడ్ల సౌకర్యం వంటివి లోటు లేకుండా కల్పించాలి. గ్యాలరీల్లోకి ప్రవేశించే సమయంలో తోపులాటలకు అవకాశం ఉంటుంది.

2024లో ముందస్తు ప్రణాళికతో తోపులాటరహిత గరుడోత్సవం రాఘవేంద్రస్వామి మఠానికి సమీపంలో ఏర్పాటు చేసిన అదనపు క్యూలైన్ల ప్రవేశంలో తీవ్రస్థాయిలో తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. ఈ ఏడాది టీటీడీ పక్కా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించింది. గ్యాలరీల్లో 2 లక్షల మంది, అదనపు క్యూలైన్లు, రీఫిల్లింగ్ ద్వారా మరో 40 వేల నుంచి 45 వేల మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. శ్రీవారి మూలవిరాట్టు దర్శనానికి మరో 50 వేల మందికి అవకాశం ఉంటుంది. ఇలా 3 లక్షల మందికంటే తిరుమలకు అధికంగా వస్తే ఇబ్బందులు తలెత్తుతాయని అంచనా వేశారు. 28న జరిగిన గరుడవాహనానికి కౌడ్ మెనెజ్మెంట్ సిస్టమ్‌ను అమలుచేసి సక్సెస్ అయ్యారు. తిరుమలకు దాదాపు 3 లక్షల మంది భక్తులు చేరిపోయారని నిర్ధారించుకున్న తర్వాత ఆరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆర్టీసీ బస్సులు మినహా మరే ఇతర వాహనం తిరుమలకు రాకుండా చర్యలు తీసుకున్నారు. కార్లను అలిపిరి వద్దే ఆపేసి, బస్సులు ఏర్పాటు చేశారు. బస్సుల సంఖ్యను కూడా తగ్గించి నెమ్మదిగా వచ్చేలా ప్లాన్ చేశారు. దీంతో పోటెత్తి పరుగులు తీసే అవసరం కనిపించలేదు. ఫలితంగా తోపులాటరహిత గరుడోత్సవాన్ని నిర్వహించగలిగారు.

◆ అనుభవమే పాఠాలుగా..

గత అనుభవాల నిర్వహణలో అనుభవం ఉన్న అధికారుల ప్రణాళికాబద్ధ కృషి. ఈఏడాది బ్రహ్మోత్సవాల దిగ్విజయం వెనుక కనిపిస్తోంది. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ గతంతో ఐదు బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అలాగే అదనపు ఈవో వెంకయ్య చౌదరి కూడా గత బ్రహ్మోత్సవంలో లోటుపాట్లను గమనించిన అధికారే. ఇక, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు పాత వారే కావడంతో గతకాలపు లోటుపాట్లను సమీక్షించుకుని ఈసారి వాటన్నింటికీ చెక్ పెట్టగలిగారు. టీటీడీలో గతంలో పనిచేసిన అధికారులు, కీలక బాధ్యతలు నిర్వహించిన సిబ్బంది, కొందరు భక్తులు, మీడియా నుంచి ముందస్తుగా సేకరించిన సమాచారంతో సమర్థవంతమైన ఏర్పాట్లు చేసి సక్సెస్ అయ్యారు. భక్తుల నుంచి ఆకలి అనే మాట వినిపించకుండా నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, మజ్జిగ అందజేసి శభాష్ అనిపించుకున్నారు.

◆ ఆ ఇద్దరి కృషి...

ఈఏడాది బ్రహ్మోత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలనే లక్ష్యంతో అదనపు ఈవో వెంకయ్య చౌదరి మూడునెలలుగా విశేషంగా కృషి చేశారు. అన్ని విభాగాలతో దఫాల వారీగా సమీక్షలు నిర్వహించి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాలు ప్రారంభానికి ముందురోజు వరకు సూక్ష్మస్థాయిలో ఏర్పాట్లపై చర్చించారు. దురదృష్టవశాత్తు ధ్వజారోహణం రోజే ఆయన తండ్రి చలమయ్య కన్నుమూయడంతో బ్రహ్మోత్సవాలకు దూరంకావాల్సి వచ్చింది. ఈ సమీక్షల్లో, ఏర్పాట్లలో బ్రహ్మోత్సవాల ముందు బదిలీపై వెళ్లిన ఈవో శ్యామలరావు పాత్ర కూడా చాలానే ఉంది.

◆ వీఐపీల హడావుడి లేదు

సాధారణంగా బ్రహ్మోత్సవాల్లో రాజకీయ నాయకుల హడావుడి చాలానే ఉంటుంది. వారి బంధువులు, మిత్రులు, అనుచరులు చేసే హంగామా సాధారణ భక్తులకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు వారిని వారించలేక సతమతం అవుతూ ఉంటారు. ఈ ఏడాది మాత్రం వీఐపీల హడావుడి పెద్దగా కనిపించలేదు. హైకోర్టు న్యాయమూర్తులు, ఓ రాష్ట్ర మంత్రి మినహా మిగిలివారెవ్వరు వాహనాల ముందు లేకపోవడంతో వాహనసేవలు ప్రశాంతంగా జరిగాయి.

◆ పెరిగిన ఆర్టీసీ సేవలు

2023 బ్రహ్మోత్సవాల్లో (ఎనిమిది రోజుల్లో) 5.5 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, గతేడాది 6 లక్షల మందికి దర్శనం లభించింది. కాగా, ఈఏడాది ఎనిమిదిరోజుల్లో 5.80 లక్షల మంది దర్శించుకున్నారు. ఇక హుండీ ఆదాయం 2023లో రూ.24 కోట్లు, 2024లో రూ.26 కోట్లు లభించగా ఈఏడాది రూ.25.12 కోట్లు లభించింది. ఇక ఆర్టీసీ సేవలు ఈ ఏడాది రికార్డు సృష్టించాయి. గతేడాది గరుడసేవ రోజున 1.86 లక్షల మంది తిరుమల-తిరుపతి మధ్య ప్రయాణించగా, ఈ ఏడాది రికార్డుస్థాయిలో 2.16 లక్షల మంది ఆర్టీసీ బస్సులను వినియోగించుకున్నారు.

కళల పండుగ.. కనుల నిండుగ

ఈసారి బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈశాన్య రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు దక్షిణాదికి ఈ బ్రహ్మోత్సవాలు పరిచయం చేశాయి. గతేడాది 18 రాష్ట్రాల నుంచి 6,884 మంది కళాకారులు ప్రదర్శనలు ఇవ్వగా, ఈ ఏడాది అత్యధికంగా 28 రాష్ట్రా నుంచి 6,060 మంది కళాకారులు వాహనాల ముందు ప్రదర్శనలిచ్చారు.

◆ ఫల, పుష్ప ప్రదర్శనలో కొరవడిన కొత్తదనం

కల్యాణవేదికలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన శాలకు భక్తులు భారీ సంఖ్యలోనే హాజరయ్యారు. అయితే కొత్తదనం కొరవడిందనే వ్యాఖ్యలు వినిపించాయి. నాలుగైదేళ్లుగా చేసిన అలంకరణలకు దగ్గరగానే ఈ ఏడాది కూడా ఉన్నాయి. శ్రీకృష్ణలీలల చిత్రాలు కొంత ఆకట్టుకున్నాయి. ప్రతి ఏడాదీ స్థానిక చిత్రకారులతో ఏదో ఒక అంశం మీద చిత్రాలు వేయించి ప్రదర్శనలో ఉంచితే మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

తిరుపతికి ఉగ్ర బెదిరింపులు

● పుణ్యక్షేత్రాల్లో ముమ్మరంగా తనిఖీలు
● ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని తేల్చిన బీడీ టీమ్‌లు


తిరుపతిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ఐ, ఎల్‌టీటీఈ పేలుళ్లకు కుట్రపన్నాయి ఉగ్రవాదుల పేరిట తిరుపతికి బెదిరింపులు వచ్చాయి. 'పుణ్యక్షేత్రమైన తిరుపతిలో పాకిస్టాన్ ఐఎస్ఐ, ఎల్టీటీఈ పేలుళ్లకు కుట్ర పన్నాయి. నాలుగు చోట్ల 'ఆర్డీఎక్స్ ఐఈడీ' పేలుడు పదార్థాలు త్వరలో పేలనున్నాయి. శుక్రవారం ఈ పేలుళ్లు జరగనున్నాయి' అంటూ శబరీశన్ వేదమూర్తి పేరిట టీటీడీ డోనార్ సెల్‌కు మెయిల్స్ వచ్చాయి. తమిళనాడులోని ప్రముఖులకూ బాంబు బెదిరింపులు రావడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో రిజర్వు, పారా మిలటరీ, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, ఎస్టీఎఫ్‌తో పాటు తిరుమల విజిలెన్సు అధికారులూ రంగంలోకి దిగారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి నాలుగు బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లతో తిరుపతితో పాటు తిరుమలను దాదాపు ఆరు గంటల పాటు జల్లెడ పట్టారు. అన్ని ప్రాంతాల్లోను, ప్రతి లగేజీ వస్తువులు, బ్యాగ్‌లు క్షుణంగా తనిఖీలు చేశారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సీఐ నేతృత్వంలో ఏఎస్ఐ రమేష్, సిబ్బంది చాంద్‌బాషా, సిబ్బంది కలసి తిరుమల, తిరుపతిలో గాలించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ప్రమాదకర వస్తువులు లేవని తేల్చారు. ఇదంతా ఉత్తుత్తి బెదిరింపుగా భావించారు. అ అయినప్పటికీ భద్రతా చర్యలను కొనసాగిం చారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు, శ్రీనివాసం, విష్ణు నివాసం, కపిలతీర్థం, గోవిందరాజుల స్వామి గుడి, తిరుమలలోని మాడవీధులు, లడ్డూ కౌంటర్లు, తిరుచానూరు పద్మావతి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయం.. ఇలా అన్ని పుణ్యక్షేత్రాల్లో తనిఖీలు చేపట్టారు. సీఎం పర్యటన నేపథ్యంలో అగ్రికల్చర్ కళాశాల హెలిపాడ్‌తో పాటు నారావారిపల్లెలోనూ బాంబు, డాగ్ స్క్వాడ్లతో తనిఖీలు ముమ్మరం చేశారు.

ఊహాగానాలు నమ్మొద్దు

ఎస్పీ 'ఈ మెయిల్స్ సమాచారంపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దు. అపోహలు, ఊహాగానాలను నమ్మకండి' అని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు.

'ముక్కంటి' పాలకమండలికి రాష్ట్రస్థాయి ప్రాధాన్యం

● వివిధ నియోజకవర్గాల నుంచి 16 మంది సభ్యుల నియామకం



శ్రీకాళహస్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలికి ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం కల్పించింది. ఇప్పటి వరకు చైర్మన్‌తో పాటు సభ్యులకూ స్థానికులకు మాత్రమే అవకాశం కల్పించేవారు. కాగా, రాహుకేతు పూజలతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. విదేశీ భక్తులూ తరచూ ఆలయానికి వచ్చి రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకొంటున్నారు. ఈ క్రమంలో ఆలయానికి రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం కల్పించి అబివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో టీటీడీ తరహాలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ 16మంది సభ్యులు, ఒక ప్రత్యేక ఆహ్వానితుడితో కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యుల వివరాలు ఉన్నాయి.

పేరు	అసెంబ్లీ నియోజకవర్గం	పార్టీ
కొట్టే సాయి ప్రసాద్(చైర్మన్)	శ్రీకాళహస్తి	జనసేన
సభ్యులు		
బీలా స్రవంతి	యలమంచలి	టీడీపీ
చిన్నపోల లక్ష్మీనారాయణ	పుటపర్తి	టీడీపీ
డి.లక్ష్మమ్మ	శ్రీకాళహస్తి	టీడీపీ
జి.గోపీనాథ్	శ్రీకాళహస్తి	టీడీపీ
కె.కుసుమ కుమారి	ఒంగోలు	టీడీపీ
కొమ్మనబోయిన రజని	చీరాల	టీడీపీ
నాగరాజు కొప్పెర్ల	చింతలపూడి(ఎస్సీ)	టీడీపీ
పెనగలూరు హేమావతి	కడప	టీడీపీ
కొమ్మరి విజయమ్మ	నెల్లూరు సిటీ	టీడీపీ
రుద్రాక్షుల కౌసల్యమ్మ	వెంకటగిరి	టీడీపీ
దండి రాఘవయ్య	శ్రీకాళహస్తి	జనసేన
పగడాల మురళి	తిరుపతి	జనసేన
వి. గుర్రప్పశెట్టి	శ్రీకాళహస్తి	టీడీపీ
కోలా వైశాలి	శ్రీకాళహస్తి	బీజేపీ
ప్రకాశ్‌రెడ్డి	తెలంగాణ	తెలంగాణ
కల్లె సావిత్రి	రాజంపేట	టీడీపీ
ప్రత్యేక ఆహ్వానితులు		
చగణం శైలజ	శ్రీకాళహస్తి	

7న నారావారిపల్లెకు సీఎం

● కుటుంబ సమేతంగా రానున్న చంద్రబాబు


నారావారిపల్లెలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని తదితరులు

చంద్రగిరి/తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా ఈ నెల7న చంద్రగిరి మండలం నారావారిపల్లెకు రానున్నారు. మంత్రి నారా లోకేశ్ కూడా వస్తున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఉండవల్లి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో బయలుదేరి అగ్రికల్చర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ్నుంచి నారావారిపల్లెకు వెళ్లి రామ్మూర్తి నాయుడి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం 11వ నెల విస్తర కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు సీఎం తిరుగు ప్రయాణమవుతారు. కాగా, సీఎం సతీమణి భువనేశ్వరి, రామ్మూర్తి నాయుడి సతీమణి ఇందిరా 5వ తేది సాయంత్రమే రానున్నారు. ఇక, రంగంపేట హైస్కూల్ సమీపంలో సీఎం పర్యటన కోసం తాత్కాలిక హెలిప్యాడ్ స్థలాన్ని ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఇక, వ్యవసాయ కళాశాలలో రూ.10లక్షలతో శాశ్వత ప్రాతిపదికన హెలిప్యాడ్ నిర్మిస్తున్నారు. ఇకపై సీఎం పర్యటనకు దీనిని వినియోగించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. కాగా, వ్యవసాయ కళాశాల గ్రౌండులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ వద్ద శుక్రవారం పారా మిలటరీ బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు తనిఖీలు చేశాయి. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ ఇమ్రాన్‌బాషా, రిజర్వు బలగాలు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

తిరుపతికి 'స్వచ్ఛ' అవార్డు

తిరుపతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా నగరాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ అవార్డును అందిస్తుంటోంది. ఇందులో భాగంగా స్పెషల్ కేటగిరీకింద స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు తిరుపతి ఎంపికైంది. ఇటీవల సూపర్ స్వచ్ఛ్ లీగ్ కేటగిరీలో 3 లక్షల జనాభా కలిగిన నగరాల్లో తిరుపతి అవార్డు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈసారి స్పెషల్ కేటగిరీ కిందఅవార్డు దక్కడంపై కార్పొరేషన్ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమష్టి కృషితోనే స్వచ్ఛ అవార్డులు అందుకుంటున్నామని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు కమిషనర్ మౌర్య చెప్పారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

● 'ఖాదీ సంత' ముగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి మురుగన్


స్టాల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి మురగన్

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర మంత్రి మురుగన్ కోరారు. తిరుపతి నగరం త్యాగరాజ మండపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన 'ఖాదీ సంత' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'ఈ వస్తువు మా ఊరుది' అని గొప్పగా చెప్పుకొనే పరిస్థితి రావాలన్నారు. ఆ దిశగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించి మన పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా నిలదొక్కునేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. అమెరికా లాంటి దేశాలు ఎన్ని అంక్షలు పెట్టినా భయపడే పరిస్థితి లేదన్నారు. అనంతరం ఆయన స్టాళ్లను సందర్శించారు. కళంకారి వస్త్రాలు, దారుశిల్పాలు తదితరాలను పరిశీలించారు. హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రిని గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కాగా, రెండు రోజులపాటు జరిగిన ఈ ఖాదీ సంతలో ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులు భారీగా అమ్ముడుపోయినట్లు నిర్వాహకులు తెలిపారు.

మూలపల్లి చెరువుకు 'హంద్రీ- నీవా' జలాలు

● రూ.126 కోట్లతో పనులకు మంత్రివర్గ ఆమోదం
● ఫలించిన ఎమ్మెల్యే నానీ కృషి

తిరుపతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నీవా బ్రాంచి కెనాల్ ద్వారా చంద్రగిరి మండలం నారావారిపల్లె సమీపంలోని మూలపల్లి చెరువుకు హంద్రీ-నీవా జలాలు రానున్నాయి. రూ.126 కోట్లతో ప్రతిపాదించిన ఈ పనులకు రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోద ముద్ర వేసింది. 'అన్నమయ్య జిల్లా కేవీపల్లెలోని అడవిపల్లి రిజర్వాయర్ నుంచీ చిత్తూరు తాగునీటి అవసరాలకు నిర్మించిన నీవా బ్రాంచి కెనాల్ పాకాల మండలం మీదుగా వెళుతోంది. ఇక్కడ్నుంచి మూలపల్లి చెరువుకు హంద్రీ నీవా నీటిని తరలించి సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తా'నని గత ఎన్నికల్లో పులివర్తి నాని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం నీవా బ్రాంచి కెనాల్ నుంచీ మూలపల్లి చెరువుకు, తర్వాత మరో నాలుగు చెరువులకు, ఆపై కళ్యాణి డ్యామ్‌కు నీటిని చేర్చేలా రూ.126.06 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కాలువ వెంబడి 1154 ఎకరాలకు సాగునీరు.. కళ్యాణి డ్యామ్ ద్వారా తిరుమల, తిరుపతికి తాగునీరూ అందుతుంది. ఈ ప్రతిపాదనలపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే నాని పలుమార్లు కలిశారు. ఈ క్రమంలో శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ పనులను ఆమోదించింది. తద్వారా నాని కృషి ఫలించింది.

సేవింతురే!

పూలభక్తుడు అనంతాళ్వార్



బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజున భాగ్ సవారీ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం సాయంత్రం స్వామి వారు వైభవోత్సవ మండపం నుంచి బయలుదేరి అప్రదక్షిణగా అనంతాళ్వారు తోటకు చేరుకుని పూజలందుకున్నారు. అంతకు ముందు అనంతాళ్వారు వంశస్థులు పురుశైతోటలో నాళాయిర దివ్య ప్రబంధం పఠించారు. ఇదంతా శ్రీనివాసుడు అనంతాళ్వారు భక్తికి మెచ్చి ఇచ్చిన వరం. తిరుమల ఆలయంలో నిత్య పూజా కైంకర్యాలకు అవసరమైన పూల కోసం ఒక తోటను తిరుమలలోనే పెంచాలని 10వ శతాబ్దంలో రామానుజాచార్యులు అనంతాళ్వారును కోరారట. ఆయన భార్యతో కలిసి తోటలోనే నివాసం ఏర్పరచుకుని స్వామికి రోజూ పూలు కోసి పంపేవారు. వారి పుష్పార్చనను పరీక్షించడానికి ఒకరోజు స్వామి శ్రీదేవీ సమేతంగా తోటకు వచ్చాడు. ఎవరో దొంగలు పూలు కోసేస్తున్నారని అనంతాళ్వారు వారిని తరుముకున్నారు. అయ్యగారు అప్రదక్షిణలో పారిపోయినా అమ్మగారు దొరికిపోయారు. చెట్టుకి కట్టేశారు. ఆ తర్వాత తెలిసిందంట వారెవరో. దీంతో అనంతాళ్వారు కన్నీరుమున్నీరయ్యారు. వారిని కరుణించిన స్వామి ఏడాదికి రెండు సార్లు తానే తోటకు వస్తానని వరమిచ్చారట. ఆ మహాభక్తుడి కోసమే బ్రహ్మోత్సవాల్లో భాగ్ సవారీ ఉత్సవం జరుగుతోంది.

చిత్రం: ఎ.రామచంద్రయ్య



ధ్వజస్తంభంపై నుంచి గరుడ పటాన్ని కిందకు దించుతున్న అర్చకులు



పుష్కరిణి వద్ద ఉత్సవర్లు, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం

కన్నుల పండువగా భాగ్ సవారి



తిరుమలలో శుక్రవారం సాయంత్రం భాగ్ సవారి ఉత్సవం జరిగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో వైభవోత్సవ మండపం నుంచి ఉత్సవర్లు బయలుదేరి అప్రదక్షిణంగా ఆనంతాళ్వారు తోటకు చేరి అక్కడ ప్రత్యేక పూజలందుకుని తిరిగి ఆలయంలోకి ప్రవేశించడంతో ఉత్సవం ముగిసింది. ఈ ఉత్సవం సందర్భంగా శ్రీవారి ఆలయానికి నైరుతి దిశగానున్న పురుశైవారి తోటలో ఆనంతాళ్వారు వంశీకులు నాళాయారా దివ్య ప్రబంధం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న జీయర్‌స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





ప్రశాంతంగా చక్రస్నానం





● ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



గురువారం రాత్రి.. ధ్వజావరోహణం సందర్భంగా ఉత్సవర్ల ఊరేగింపు



తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం రాత్రి జరిగిన ధ్వజావరోహణంతో సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజైన గురువారం ఉదయం చక్రస్నానం ప్రశాంతంగా జరిగింది. ఆలయం నుంచి ఉత్సవర్లను తిరుచ్చిలో, చక్రత్తాళ్వార్‌ను పల్లకీలో మాడవీధుల్లో ఊరేగింపుగా వరాహస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం చక్రత్తాళ్వార్‌ను అర్చకులు పుష్కరిణిలో మూడు మునకలు వేయించడంతో చక్రస్నానం ముగిసింది. చక్రత్తాళ్వార్‌ను మునకలు వేయించగానే పుష్కరిణిలో వేచివున్న వేలాదిమంది భక్తులు గోవింద నామస్మరణలతో స్నానమాచరించారు. ముందస్తు ప్రణాళికతో భక్తులను క్యూలైన్ ద్వారా పంపడంతో తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకోలేదు. జీయర్ స్వాములు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇక, సాయంత్రం 7 గంటలకు ఉభయ దేవేరుల సమేతంగా స్వామి వారు బంగారు తిరుచ్చిలో మాడవీధుల్లో ఊరేగుతూ ఆలయంలోని ధ్వజస్తంభం వద్దకు చేరుకున్నారు. 9 గంటలకు పూజాది కార్యక్రమాల తర్వాత ధ్వజస్తంభంపై ఉన్న గరుడ పటాన్ని శాస్త్రోక్తంగా కిందకు దించారు. ఉత్సవాల మొదటిరోజు ధ్వజారోహణం సందర్భంగా గరుడాళ్వార్ ఆహ్వానించిన దేవతలను తిరిగి పంపే కార్యక్రమాన్నే ధ్వజావరోహణం అంటారు. ఈ సందర్భంలోనే తిరిగి వచ్చే బ్రహ్మోత్సవాలకు రావాలని గరుడాళ్వార్ దేవతలను కోరతాడట.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

10,86,197 మంది ఘాట్ ప్రయాణం

● ఆర్టీసీకి రూ.9.94 కోట్ల రాబడి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ బస్సుల ద్వారా 10,86,197మంది తిరుమల, తిరుపతి మధ్య రాకపోకలు సాగించారు. తొమ్మిది రోజుల్లో 425 బస్సులు.. 16,223 ట్రిప్పుల్లో 4,90,894మంది తిరుపతి నుంచి తిరుమలకు.. 16,525 ట్రిప్పుల్లో 5,95,303 మంది తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణించారు. 82 ఆక్యుపెన్సీ రేషియోతో రూ.9.94 కోట్లు సమకూరినట్లు ప్రజారవాణాధికారి జగదీష్ తెలిపారు. గతేడాది 10,77,273 మంది రాకపోకలు సాగించారని గుర్తుచేశారు.



ఆలయంలో తోపులాటలు

● ఉద్యోగులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు

● డయల్ యువర్ ఈవోలో భక్తుల ఆవేదన



తిరుమల, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో బంగారు వాకిలి నుంచి వెండి వాకిలి వరకు భక్తుల మధ్య తోపులాట అధికంగా ఉందని, అక్కడ విధుల్లో ఉన్న కొందరు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ తిరుపూర్‌కు చెందిన నాగేశ్వరరావు డయల్ యువర్ ఈవో కార్యక్రమం ద్వారా ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈవో స్పందిస్తూ భక్తులతో ఎలా ప్రవర్తించాలనే అంశంపై సేవకులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. రూ.300 ప్రత్యేక దర్శనం మూడు నెలల ముందు కాకుండా నెల ముందు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్(కడప) కోరగా, ఈవో పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదికి ఓసారి దర్శనం కల్పించాలని మల్లేశ్వరరావు(పల్నాడు) విజ్ఞప్తి చేయగా, రూ.300 దర్శనం టికెట్లు ఆన్‌లైన్ ద్వారా పొంది దర్శనానికి రావాలని ఈవో సూచించారు. అంగప్రదక్షిణ టోకెన్లు ప్రతినెలా ఇవ్వాలని హరికృష్ణ(ఖమ్మం), మాధురి(హైదాబాద్) విజ్ఞప్తి చేయగా, ఈ అంశంపై టీటీడీ బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగుల దర్శన టోకన్లు మూడు నెలల ముందు జారీ చేయడంతో అనారోగ్యం కారణాలతో రాలేకపోతున్నారని, ఒక నెల ముందు లేదా తిరుమలలో కరెంట్ బుకింగ్ ద్వారా ఇవ్వాలని అలేఖ్య, అరుంధతి, సుబ్బలక్ష్మీ(హైదరాబాద్) కోరగా, ఈవో పరిశీలిస్తామన్నారు.

తలకోన ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం



నూతన పాలకవర్గం

ఎర్రావారిపాలెం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి); తలకోన సిద్దేశ్వరస్వామి ఆలయ పాలక మండలి కొలువుదీరింది. ఛైర్మన్‌గా మండలంలోని ఎల్లమందకు చెందిన సోమనాథరెడ్డి, సభ్యులుగా వీఆర్ అగ్రహారానికి చెందిన శిరివేలు రమేష్, నెరబైలుకు చెందిన శశికళ, చెంగమ్మ, ఉస్తికాయలపెంటకు చెందిన రాజన్న, బోడేవాండ్లపల్లెకు చెందిన ఇందిర, బాయికాడ కమ్మపల్లెకు చెందిన లంకిపల్లె శోభ, కోటకాడపల్లెకు చెందిన చలపతి, ఎం ఈశ్వరయ్య, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు సత్యప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. దేవదాయ శాఖ ప్రత్యేకాధికారి శశికుమార్ ఆలయ ప్రాంగణంలో వారితో ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. ఈ కమిటీ రెండేళ్లపాటు పదవిలో ఉంటుంది.

కొనసాగుతున్న పీహెచ్‌సీ డాక్టర్ల సమ్మె



ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీపీహెచ్‌సీడీఏ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ డాక్టర్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. శుక్రవారం పలు యూనియన్లు వారికి మద్దతుగా నిలిచాయి. పీహెచ్‌సీల్లో తాత్కాలికంగా నియమించిన డాక్టర్లకు 25 ఏళ్లుగా పదోన్నలులు కల్పించకపోగా పీజీ కోటాను 20 నుంచి 15 శాతానికి తగ్గించడం అన్యాయమన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీహెచ్‌సీడీఏ నేతలు డాక్టర్ చత్రప్రకాష్, రూప్‌కుమార్ పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపితే జైలే

ముగ్గురికి రెండు రోజులు...ఒకరికి 10 రోజుల రిమాండ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తాగి వాహనం నడిపితే జైలుకు వెళ్లక తప్పదని తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి రెండు రోజులు, ఒకరికి 10 రోజులు రిమాండ్ విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రమాకృష్ణమాచారి నేతృత్వంలో 10 రోజులుగా నగరంలో తనిఖీలు నిర్వహించి, 50మందిపై కేసులు నమోదు చేశారు. వారిని విడతల వారీగా న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తున్నారు. 13 మందిని హాజరుపరచగా ముగ్గురికి రిమాండ్, మరో 10 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

ఆరోగ్య వరప్రసాదినికి రూ.30 లక్షల విరాళం



తిరుమల, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆరోగ్యవరప్రసాదిని (స్విమ్స్) పథకానికి గురువారం రూ.30 లక్షలు విరాళంగా అందింది. ఖమ్మంకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ అంకిత్ తిరుమలలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి విరాళం చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు శాంతారామ్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్...డబుల్ బెనిఫిట్స్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై టీడీపీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి) : డబుల్ ఇంజన్ ఎన్డీయే సర్కార్‌తో ప్రజలకు డబుల్ బెనిఫిట్స్ అందుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ శుక్రవారం టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి గాంధీ రోడ్డు మీదుగా ర్యాలీగా వెళ్తూ జీఎస్టీ గురించి ప్రజలకు అవగాహన పెంచేలా పోస్టర్లను ప్రదర్శించారు. దుకాణాలకు వెళ్లి వినియోగదారులు, విక్రయదారులతో జీఎస్టీ గురించి మాట్లాడారు. సుగుణమ్మ, టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఆర్థికంగా వెసులుబాటు లభిస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, నాయకులు శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్ యాదవ్, పుష్పావతి యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, ఊట్ల సురేంద్ర నాయుడు, బ్యాంకు శాంతమ్మ, చినబాబు, పాటకం వెంకటేష్, ఆముదాల తులసీరాం పాల్గొన్నారు.

భాషా పండితులకు ఊరట

● ఆరేళ్ల సమస్యకు పరిష్కారం

● న్యాయస్థానం ఆదేశాలతో ఉద్యోగోన్నతులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ల పోరాట ఫలితం, న్యాయస్థానం ఆదేశాలతో జిల్లాలో పండిట్‌లకు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఉన్న భాషోపాధ్యాయులకు (తెలుగు, హిందీ, ఉర్దూ) 2019లో ఉన్నతీకరణ జరిగింది. 2017లో ఇచ్చిన జీఓ నెం 91ను గత వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టి జీఓ నెం 77ను ప్రవేశ పెట్టింది. దీంతో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు పదోన్నతి పొందగా అర్హులైన భాషా పండితులు అవకాశాన్ని కోల్పోవడంతోపాటు ఎల్‌పీ కేడర్ లేకుండా పోయింది. భాషాపండితులను డీఈఓ పూల్ కింద పరిగణించి వర్క్ అగైనెస్ట్ వేతనాలతో విధులు కేటాయిస్తున్నారు. దీంతో జిల్లాలో భాషోపాధ్యాయుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. 2019లో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పదోన్నతులు వీరికి తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ప్రస్తుతం జిల్లాలో జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 71 మంది తెలుగు, ఏడుగురు హిందీ, ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో ఏడుగురు హిందీ పండిట్‌లు ఉన్నారు. అయితే సాధారణ ఉపాధ్యాయుడికి ఒకసారి బదిలీ అయితే జిల్లాలో ఏదైనా పాఠశాలలో కనీసం 8 ఏళ్లు పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. డీఈఓ పూల్‌లో ఉన్న భాషోపాధ్యాయులకు మాత్రం బదిలీలు జరిగిన ప్రతిసారీ ఇష్టం లేకున్నా బలవంతంగా బదిలీలకు గురవుతున్నారు. ఇలా గడిచిన ఆరేళ్లలో నాలుగుసార్లు బదిలీ అయ్యారు. దీనిపై గత ప్రభుత్వంలో భాషా పండితులు న్యాయస్థానాలను ఆశ్రయించగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

● 85 మందికి ఉద్యోగోన్నతులు

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో తెలుగు, ఉర్దూ, సంస్కృతం, హిందీకి సంబంధించిన 87 మంది భాషా పండిట్‌లలో 85 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ డీఈఓ బాలాజీరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో భాషా పండిట్‌లు తమ కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణ బావుంది

బీజేపీ ఎంపీ పురందేశ్వరి

తిరుమల, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాను విజయవంతం చేసిన టీటీడీ ఛైర్మన్, ఈవో, బోర్డు సభ్యులను బీజేపీ ఎంపీ పురందేశ్వరి అభినందించారు. కుటుంబ సమేతంగా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా భక్తులు కూడ క్రమశిక్షణతో వ్యవహరించారని, వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. భగవంతుడికి అన్యాయం చేయాలని ప్రత్నించినవారిని భగవంతుడే శిక్షిస్తారని, పరకామణి వంటి విషయాలను మనం ఇప్పటికే చూశామని పురందేశ్వరి వ్యాఖ్యానించారు.



ఆలయం ముందు పురందేశ్వరి

సత్యవేడులో చోరీ

● 15 సవర్ల బంగారం, 10 కిలోల వెండి అపహరణ



వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

సత్యవేడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో చొరబడి బంగారు, వెండి నగలు, నగదు అపహరించుకెళ్లారు. పట్టణంలోని పల్లవ వీధిలో నివసిస్తున్న కృష్ణమూర్తి నాలుగు నెలల క్రితం అమెరికాలోని తన కుమారుడి వద్దకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని పసిగట్టిన గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించి బీరువాలలో భద్రపరచి ఉన్న 15 సవర్ల బంగారు నగలు, సుమారు 10 కిలోల వెండి వస్తువులతో పాటు రూ.60 వేలను అపహరించుకుని వెళ్లారు. ఉదయం ఇంటి తాళాలు పగుల కొట్టి, తలుపులు తెరచి ఉండడంతో గమనించిన కృష్ణమూర్తి బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీంకు సమాచారం అందించారు. చిత్తూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఇంటిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకునింది. కాగా ఒంటి గంట సమయంలో ఎవరో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంట్లోకి ప్రవేశించి, తెల్లవారు జామున మూడు గంటల సమయంలో వెలుపలికి వచ్చినట్లు పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీల ద్వారా తెలుస్తోంది. చోరీకి పాల్పడ్డ వ్యక్తులు బజారు వీధిలోకి ప్రవేశించి అక్కడ నుంచి డిపో రోడ్ మీదుగా జారుకున్నారు. అదే విధంగా కోమటిగుంట సమీపంలోని హరికృష్ణ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువా పగులకొట్టి అందులో దాచిఉంచిన మూడు సవర్ల బంగారం చోరీ చేశారు. హరికృష్ణ కుటుంబంతో ఊరెళ్లడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నారాయణవనం, అక్టోబర్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కీళగరంలో 98 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నారాయణవనం ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పౌర సరఫాల అధికారి ఫిర్యాదు మేరకు కీళగరం జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న పెరుమాల్ ఇంట్లో రవాణాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 50 కిలోలు కలిగిన 98 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. పెరుమల్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు 2,20,500 ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ ట్రెక్కింగ్ శిబిరం



ధృవీకరణ పత్రాలతో ఎన్‌సీసీ క్యాడెట్లు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఎనిమిది రోజులపాటు జరిగిన ఎన్‌సీసీ ఆలిండియా ట్రెక్కింగ్ శిబిరం గురువారం ముగిసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, అండమాన్, పాండిచ్చేరి, కేరళ, లక్షద్వీప్, మహారాష్ట్ర, కర్నాటక, గోవాల నుంచి 510 మంది ఎన్‌సీసీ బాయ్ క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొన్నారు. శేషాచలం బయోస్పియర్ రిజర్వు, పరిసర ప్రాంతాలు, తిరుమల జూలాజికల్ పార్క్, రీజినల్ సైన్స్ సెంటర్, నాగర్వణం ఎకోలాజికల్ పార్క్ తదితర ప్రాంతాల్లో ట్రెక్కింగ్ నిర్వహించారు. చివరి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న వారికి ధృవీకరణ పత్రాలు ప్రదానం చేశారు.

గాంధీ ఆశయాలు ఆదర్శనీయం



గాంధీకి నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నెలవల రాజేష్ తదితరులు

నాయుడుపేట, అక్టోబరు 3: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు ఆదర్శనీయమని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, జనసేన నాయకులు అట్ల కృష్ణారావు, గిండి సతీష్, కుంపటి శ్రీను, తాళ్లరెడ్డి శ్రీనివాస్, పవన్‌కళ్యాణ్, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

బాలాయపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించుకునేందుకు గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇరవై నాలుగు పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవలసిన పనులను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించారు. బాలాయపల్లి పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజలకు ఉపయోగ పడే పనులను గుర్తించేందుకు గ్రామసభలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో జ్యోతి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



పారిశుధ్య కార్మికులతో షార్ డైరెక్టర్ పద్మకుమార్, ఉద్యోగులు

సూళ్లూరుపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. శ్రీహరిహరి కోటలోని సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో గురువారం గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరి సరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 2 వరకు ప్రజలకు పరిసరాల శుభ్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అందరూ భాగస్వాములయ్యేలా పిలుపునిచ్చిందన్నారు. అంతకుముందు షార్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెరియన్, షార్ కంట్రోలర్ సీహెచ్ రమేష్ బాబు, పలు విభాగాలకు డీడీలు రమణారెడ్డి, సునీల్, గోపికృష్ణ, రమణ బాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి



పోలేరమ్మను దర్శించుకుంటున్న ఆలయ కమిటీ సభ్యుడు నిత్యకృష్ణారెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఆలయ కమిటీ సభ్యుడు నిత్యకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పోలేరమ్మ ఆలయం వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గుదలతో ప్రజలకు మేలు

గూడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. స్థానిక జనార్దనరెడ్డి కాలనీలో శుక్రవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తక్కెళ్లపాటి చంద్రమౌళి, మైనంపాటి మోహన్, అమరయ్య నాయుడు, పులిమి శివకుమార్, నరసింహులు నాయుడు, రమేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కాంద్ర గ్రామంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు రాజు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్, రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

కోట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు, వంజివాక గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏవో సుచేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ పరికరాలు, ఎరువులపై జీఎస్టీని 12 నుంచి 5శాతానికి తగ్గించిందన్నారు. అనంతరం జీఎస్టీ తగ్గడం వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయండి

కోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీ ప్రకాశంకాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ఆ గ్రామస్తులు తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. రెండు కిలో మీటర్ల దూరంలోని గూడలికి వెళ్లి సరుకులు తీసుకోవడం ఇబ్బందిగా ఉందన్నారు. దీనివల్ల కూలి పనులకు వెళ్లలేక జీవనోపాధి కోల్పోతున్నామన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి



సూళ్లూరుపేట: పార్వతీదేవి గ్రామోత్సవంలో ఎమ్మెల్యే విజయశ్రీ, ఆలయ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు



గూడూరు: విజయదుర్గాదేవి గ్రామోత్సవంలో ఎమ్మెల్యే పాశం



సూళ్లూరుపేట: శయన సేవలో కన్యకాపరమేశ్వరి



సూళ్లూరుపేట: గ్రామోత్సవంలో మహిషాసురమర్ధినిగా చెంగాళమ్మ



గూడూరు: గ్రామోత్సవంలో నారాయణమ్మ



నాయుడుపేట: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో మూకాంబికాదేవి

వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం

గూడూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పట్టణంలో అమ్మవార్ల గ్రామోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గతనెల 22వ తేదీన కలశ స్థాపనతో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. గురువారం రాత్రి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి కలశోద్వాసనకు తరలించి గ్రామోత్సవం జరిపారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠం, నారాయణమ్మ ఆలయం, బజారుకలశంలోని దుర్గాదేవి ఆలయం, రాజ రాజేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. వాల యనందాపురం, బొడ్డుచౌక, వీరారెడ్డిపల్లిలోని మహాలక్ష్మమ్మ అమ్మవార్లను శక్తి రూపంలో అలంకరించి గ్రామోత్సవం జరిపారు. కేరళ వాయిద్యాలు, మంగళ మేళాలు, తప్పెట్లు తాళాలు, పార్వతీమహిషాసుర యుద్ధ నృత్యాలు, కోలాటాలు, కీలుగుర్రాల నృత్యాలు, జింగిరిమేళాలు, తెనాలి బ్యాండ్ యువత చిందుల నడుమ బాణాసంచా పేల్చుతూ వైభవంగా పట్టణ పురవీధుల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు ఊరేగించారు. విజయదుర్గాదేవి ఉపపీఠంలో, ధర్మరాజస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పూజలు నిర్వహించారు. గ్రామోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ గీతాకుమారి పర్యవేక్షణలో పోలీలసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ముగిశాయి. చివరిరోజు గురువారం విజయదశమి సందర్భంగా చెంగాళమ్మ పరమేశ్వరిని మహిషాసురమర్ధిని అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకానంతరం పుష్పాలంకరణ చేశారు. అనంతరం చండీయాగం నిర్వహించారు. చండీయాగానికి శింగన ఓబుల్ రెడ్డి, పద్మజారెడ్డి, అలంకారానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారథి దంపతులు అమ్మవారికి సారె, పట్టు వస్త్రాలను సమర్పించారు. రాత్రి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద శమీ పూజ చేశారు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి దంపతులు జమ్మిచెట్టుకు పూజలు చేశారు. రాత్రి శివపార్వతుల గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం దంపతులు నాగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరికి శయనసేవ జరిపారు. ఈ సందర్భంగా వసంతోత్సవం, ఊంజల్ సేవ నిర్వహించారు.

నాయుడుపేట: పట్టణంలోని మూకాంబికాదేవి, పోలేరమ్మ, కన్యకా పరమేశ్వరి, మానసాదేవి, దుర్గాదేవి, అంకమ్మ అమ్మవార్లు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

డక్కిలి: మండలంలోని దేవుడివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో పార్వతీదేవి శుక్రవారం రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తుల రద్దీ పెరిగింది.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని మందనాంచరేశ్వరికి బంగారుపూత, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో కాత్యయనీ దేవికి లలితా త్రిపుర సుందరిదేవి అలంకారం, వెంకటేశ్వర స్వామికి మహావిష్ణువుగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓజిలి: మండలంలోని భట్లకనుపూరు, అత్తివరం, అరిమేనిపాడు, చిల్లమానుచేను, ఓజిలి, కురుగొండ, కరబల్లవోలు, మనవాలి గ్రామాల్లోని ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. భట్లకనుపూరులో వెలసిన జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యే పూజలు చేశారు.



డక్కిలి: రాజరాజేశ్వరిదేవి అలంకరణలో పార్వతీదేవి



వెంకటగిరి: మందనాంచరేశ్వరికి బంగారు రేకులతో అలంకారం



వెంకటగిరి: లలితాత్రిపురసుందరి అలంకారంలో కాత్యయనీదేవి



గూడూరు: గ్రామోత్సవంలో వాలయనందాపురం మహలక్ష్మమ్మ



గూడూరు: గ్రామోత్సవంలో ద్రౌపదిదేవి



గూడూరు: గ్రామోత్సవంలో బజారు కలశం దుర్గాదేవి

టీడీపీ హయాంలోనే మున్సిపాలిటీ అభివృద్ధి: పాశం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలోనే గూడూరు మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆస్పత్రి రోడ్డులో కోటి రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. తాను మున్సిపల్ చైర్మన్ అయినప్పటి నుంచి రెండు దఫాలు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ వంటి పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. త్వరలోనే పట్టణంలో ప్రజలకు రెండు పూటలా మంచినీటిని సరఫరా చేసేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం స్థానిక మున్సిపాలిటీలో మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తులోని కౌన్సిల్ సమావేశ మందిరం, ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రారంభించి పారిశుధ్య కార్మికులకు బహుమతులను అందజేశారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ నూతన భవనం అందుబాటులోకి రావడంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, కల్పన, వాటంబేడు శివ కుమార్, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

పెళ్లకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో టీడీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య గురువారం ప్రారంభించారు. స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయ కులు మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, కృష్ణమ నాయుడు, కిలారి గోపి, గంగా బత్తిన శ్రీనివాసులు, సన్నారెడ్డి వేణురెడ్డి, వేలూరు రమేష్‌రెడ్డి, సుందర రామిరెడ్డి, మల్లు ప్రసాద్, కృష్ణయ్య, కేశవరెడ్డి, కాంద్ర రమణయ్య, గుంట పూడి రమణయ్య, రఘురామయ్య, సుమన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి సభ్యురలిగా కౌసల్యమ్మ



వెంకటగిరి, అక్టోబర్(ఆంధ్రజ్యోతి) 3: ప్రఖ్యాత శైవక్షేత్రం శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులను ప్రభుత్వం శుక్రవారం నియమించింది. ఇందులో వెంకటగిరికి చెందిన టీడీపీ నాయకురాలు రుద్రాక్ష కౌసల్యమ్మకు చోటు దక్కింది. సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు టీడీపీలోనూ క్రియాశీలకంగా ఉన్న కౌశల్యమ్మకి శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలిలో చోటు దక్కడం పట్ల పార్టీ టీడీపీ వర్గాల్లో హర్షం వ్యక్తమతోంది. పలువురు నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కృషితో తనకు ఈ పదవి లభించిందని కౌసల్యమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

జీఎస్టీ 2.0తో రైతులకు ఎంతో మేలు: విజయశ్రీ



వేనాటి పరంధామరెడ్డి కుటుంబసభ్యులను, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని సత్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి

తడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీఎస్టీ 2.0తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో తడ పీఏసీఎస్ చైర్మన్‌గా వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్లుగా టీకే.రవి, ఎస్.సుధాకర్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, తదితరాలపై జీఎస్టీ తగ్గి రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తుండటంతో మహిళల్లో ఆనందం కనబడుతోందన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తలకు టీడీపీ అండగా ఉండి న్యాయం చేస్తుందని తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ డిజిటల్ బుక్ పేరుతో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. గత వైసీపీ హయాంలో అప్పటి నాయకుల మాటలు విని అవకతవ కలకు పాల్పడ్డ అధికారులు ఎంతో మంది జైలుపాలు అయ్యారని అన్నారు. ఇప్పుడు అధికారులను బ్లాక్ మెయిల్ చేయడం మంచి పద్దతి కాదన్నారు. అదే గత ఐదు పర్యాయాల టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి తప్పులు ఏమీ లేకపోవడంతో ఒక్క అధికారి సైతం జైలుకు వెళ్లిన పరిస్థితి లేదన్నారు. ఇదే వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలకు ఉన్న తేడా అని, ప్రజలు సైతం గుర్తించారని మరోసారి వైసీపీకి అధికారం కట్టబెట్టే ఆస్కారమే లేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లుగా బాధ్యతలు తీసుకున్న వారిని టీడీపీ నాయకులు సత్కరించారు. అలాగే దివంగత వేనాటి పరంధామరెడ్డి కుటుంబ సభ్యులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకరరెడ్డి, మురళీరెడ్డి, సెల్వం, నీలకంఠం, బొమ్మన పళణి, సుదర్శన్ మొదలియార్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10వేల విరాళం



నాగశక్తి పీఠాధిపతి చిదానందస్వామికి విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకుడు కృష్ణపట్నం చంద్రశేఖర్

కోట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో రాజ రాజేశ్వరి ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు కృష్ణపట్నం చంద్రశేఖర్ రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. ఆ విరాళాన్ని నాగశక్తి పీఠాధిపతి చిదానంద స్వామికి అందజేశారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ

గూడూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పు వీధికి చెందిన యస్విని అనే విద్యార్థినికి 'అందరి కోసం' సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ల్యాప్‌టాప్ అందజేశారు. ఆ సంస్థ ప్రతినిధి బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ 1989లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సహకారంతో అందరి కోసం సంస్థను ఏర్పాటు చేసి పేద విద్యార్థుల విద్యాభి వృద్ధికి సహకారం అందిస్తున్నామని తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల అందజేత

నాయుడుపేట టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పట్టణానికి చెందిన తంబిరెడ్డి మధుసూదనరెడ్డి దుస్తులు గురువారం అందజేశారు.